
నవయు!!!
బానిసవిద్యావిధానం
నశించాలి
సామ్రాజ్యవాదం
నశించాలి

నవయుగ పోటీలు

పాఠకులకు విజ్ఞప్తి

'నవయుగ' ఆర్థిక పరిస్థితులు సంపాదకీయంలో వివ
రించాం 'నవయుగ' అభివృద్ధికి మీశక్తికొలది విరాళం
పంపమనికోరాం కాని మీ బాధ్యత యింతలో తీరిపోదు

'నవయుగ' ఎల్లకాలం ఎట్టి వడుదుడుకులు లేకుండా
నడవాలని కోరుతాము అందుకు మీ మిత్రులనుండి విరా
ళాలు వసూలుజేసి పంపండి మీ మిత్రునికి తానెందుకు
'నవయుగ' చందా దారునిగా చేరవలసినదని నచ్చచెప్పి,
చందాదారునిగ చేర్పించండి ప్రతి పాఠకుడూ కృషిజేస్తే
'నవయుగ' నిధి సకాలానికి పూర్తి అవుతుంది 'నవయుగ'
నిర్విఘ్నంగా కొనసాగుతుంది

'నవయుగ' ఎడ పాఠకులుచూపే ఉత్సాహానికి ప్రతి
ఫలంగా మాకు చేతనైన బహుమానం మీకియ్యనెంచాం

ఆగస్టు 9 నాటికి తన మిత్రులనుండి 50 రూపాయిల
విరాళం 'నవయుగ నిధికి' వసూలుజేసిపంపినా, 25
చందాలు (అర్థ, పావు, సంవత్సరచందాలు మొత్తం
కూడ లెక్కించబడును) వసూలుజేసి సకాలంలోఆఫీసుకుపంపి
నవారికో సంవత్సరకాలం 'నవయుగ' ఉచితముగా పంపుతాం.

విద్యార్థి, యువజన జిల్లాసంఘాలకు వారివారి జిల్లాల
వైశాలానుబట్టి 'నవయుగ' చందావసూళ్ళు, విరాళాల పోటీ
లలో ప్రత్యేక కృషి సల్పినవారికి ప్రత్యేక జెండా బహూక
రించుటకు సంపాదకవర్గం నిర్ణయించింది

'నవయుగ' పాఠకులు, విద్యార్థి యువజన సంఘాలు
ఈపోటీలలో పాల్గొని 'నవయుగ'కు శక్తికొలది తోడ్పడు
తారని ఆశించుతాం

—మేనేజరు

ప్రజా జీవితచిత్రాలు

యువకులైన ఫొటోగ్రాఫర్లు ప్రజాజీవితాన్ని చిత్రించే ఫొటోలు తీసి యీ శీర్షిక క్రింద ప్రచురణకు పంపగోరుతాం


—సంపాదకుడు



శ్రీశైల మార్గములోని పెద్దచెర్వు ప్రదేశంలో తీసిన చిత్రం

ఫొటో
యన్
రామలింగేశ్వరరావు

★



గాజుల్లంకలో బాలుడు పొలములో పనిచేయుచున్న దృశ్యము.

ఫొటో :
వి. వెంకటేశ్వరరావు

★

నవయుగ

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి, యువజన మాసపత్రిక.

సంపుటి 1 | 1947 జూన్ | సంచిక 4

★ సంపాదకీయం

'నవయుగ' నిధికి విరాళాలిచ్చి తోడ్పడండి!

'నవయుగ' ప్రచురణ ప్రారంభమయి యీ సంచికతో నాల్గు మాసములు పూర్తయింది. ఈ నాల్గుమాసముల కాలంలోను 'నవయుగ' ఆంధ్ర విద్యార్థి, యువజనుల ఏకైక పత్రికగా యువజన విద్యార్థి సమస్యలను చర్చించుతూ విద్యార్థి, యువజనోద్యమాభివృద్ధికి శక్తికొలది కృషి సల్పింది. ఈ నాల్గునెలల కాలంలోను ప్రజా ఉద్యమాలపై తీవ్ర నిర్బంధవిధానం కేంద్రీకరింపబడింది. నిర్బంధ విధానమును ప్రజా బలంతో ఓడించుటకు, ప్రజామంత్రివర్గం నిర్బంధవిధాన పంధాను వీడునట్లు యితర ఉద్యమాల సహకారంతో యువజన, విద్యార్థి ఉద్యమాలు పనిచేయు నట్లు 'నవయుగ' శక్తికొలది కృషిసల్పింది. ఇందుకు విద్యార్థులు, యువకులు అనుసరించ వలసిన మార్గమును చూపుతూ వచ్చింది.

ఈనాల్గు మాసములలో మనస్వాతంత్ర్య ఉద్యమాన్ని చావుదెబ్బ కొట్టుటకు సామ్రాజ్యవాదులు శక్తివంచన లేకుండా కృషిసల్పుతున్నారు. ఒకప్రక్క మన జాతీయోద్యమ శక్తికి తాళలేక 1948 జూన్‌కు భారత దేశంనుండి మూటాముల్లెకట్టుతామని ప్రకటించినా, స్వదేశసంస్థానములను 'స్వతంత్రములు'గా ప్రకటించి—యీసామ్రాజ్యవాద తొత్తులద్వారా భవిష్యత్‌లో తమపెత్తనం సాగించ నేడుసామ్రాజ్యవాదులు జూస్తున్నారు. సామ్రాజ్యవాదుల యీకుట్రలను 'నవయుగ' బహిరంగ పర్చుతూ వచ్చింది. యువకులనుసరించ వలసిన విప్లవ బాటను జూపుతూవచ్చింది,

ఈ నాల్గు మాసములలో 'నవయుగ' ప్రపంచ యువజనోద్యమాలను కూర్చి, వివిధదేశాలలో యువకులు దేశపునర్నిర్మాణ కార్యక్రమములో అనుసరించుతున్న పాత్రను, ఆంధ్రవిద్యార్థి, యువకులకు విశదపర్చుతూ వచ్చింది. మనదేశ అభివృద్ధికి యువజనోద్యమం ఆందోళన. జేయవలసిన నినాదాలను 'నవయుగ' యువకులముందుంచుతూ వచ్చింది,

విశాలాంధ్ర నిర్మాణమునకు మితవాదనాయకులు అనుసరించుతూన్న రాజీపంధాను 'నవయుగ' బహిరంగ పర్చింది. విశాలాంధ్రనిర్మాణమునకు కృషిసల్పమని, తెలంగాణా వీరోచితపోరాటమును బలపర్చమని 'నవయుగ' ఆంధ్రయువకులకు, విద్యార్థులకు పిలుపు యిచ్చింది.

'నవయుగ యీ నాల్గుమాసములలోను యువజన, విద్యార్థి ఉద్యమాలను ఎదుర్కొన్న ప్రధానసమస్యలను చర్చించింది. యువజనవిద్యార్థి ఉద్యమాలను 'నవయుగ' ప్రతిబింబించునట్లు జేయుటకు శక్తికొలది కృషి సల్పింది.

'నవయుగ' ఆంధ్రయువకులలోను, విద్యార్థులలోను సరియైన విజ్ఞానవ్యాప్తి కల్గించకంకణం కట్టుకొంది. మరియేయితర ఆంధ్రమాస పత్రికా ప్రకటించలేని చక్కని విజ్ఞానవిషయాలను 'నవయుగ' ఆంధ్ర యువజన లోకానికి అందించుతూ వచ్చింది.

'నవయుగ' నిర్వహణలో దిద్దుకోవలసిన అనేక లోపాలున్నా ఆంధ్ర విద్యార్థియువజనుల మాస పత్రికగా దినదినాభివృద్ధిచెందుతూంది దీనిఫలితంగానే నేడు 'నవయుగ' 4 వేలకాపీలను ముద్రించగల్గుతున్నాం. నాల్గునెలలు నిండని మాస పత్రిక నాల్గువేలప్రతులను ముద్రించుట చిన్న విషయంగాదు. ఇది 'నవయుగ' యెడ ఆంధ్ర విద్యార్థి, యువజనలోకం చూపిన ఆదరంచేతనే సాధ్యమయింది. 'నవయుగ' సగర్వంగా చెప్పుకొనగల్గిన యిన్నివిషయాలున్నా ఆర్థికవిషయాలలో 'నవయుగ' పెద్ద ఊబిలోవుంది. పత్రికాప్రారంభఅవసరంతో సరియైన ఆర్థికపునాదులు లేకపోయినా పత్రికప్రచురణకు పూనుకోవలసిన ఆవశ్యతను గుర్తించి ప్రారంభించాం. అందుచే 'నవయుగ' 750 రూ.లకు మించి అప్పులపాలయింది. నేటివరకు'నవయుగ' నిర్వహణకు 1580 రూ, విరాళములు చేరినాయి. ఉదారంగా విరాళాలుపంపిన మిత్రులందరికీ మా అభివందనలు. కాని యీ డబ్బులోహెచ్చుభాగం 'నవయుగ'కు సక్రమమైన ఆఫీసుఏర్పాట్లు జేయుటకే ఖర్చయింది. పైపెచ్చునేడు మార్కెటులో కాగితంవిపరీతమైన ధరలకు కొనవలసివస్తున్నది. పత్రికను ఆకర్షణీయంగా తీసుకుని వచ్చుటకు బ్లాకులకే125 రూ.లచొప్పునప్రతి సంచికకుఖర్చుపెట్టవలసివస్తున్నది ఆర్టుపేపరుకవరును వేసిన అధికంగా మరియొక 100 రూ. లు ఖర్చుపెట్ట వలసివస్తున్నది.

ఈ కారణాల ఫలితంగా 'నవయుగ' నాల్గువేలు ముద్రించుతున్నా నష్టంతోనే నడపవలసి వస్తున్నది. 5 వేల కాపీలు ముద్రింపగల్గినప్పుడే 'నవయుగ, ఖర్చులు-రాబడి సరిపోగలవు. నేటి యీ పరిస్థితి ఫలితంగా 'నవయుగ'ను ఆర్థికచిక్కుల నుండి రక్షించమని పాఠకులకు విజ్ఞప్తి జేయుచున్నాం, వెంటనే రద్దుచేయవలసిన అప్పు 750 రూ.నేడువున్నది 'నవయుగ' ప్రతిపర్యాయం మార్కెటులో న్యూస్ ప్రింటుకు దేవులాడ కొనకుండా యుండుటకు ఒక టన్నుకాగితమైనను వెంటనేకొనవలసి యున్నది. ఇందుకు 1200 రూ॥ అవసరం. ప్రతిపత్రికకు అవాంతరాలలో సాయపడుటకని బ్యాంకులో కొంతనిల్వ యుంచుతారు. కాని'నవయుగ బ్యాంకునిల్వ 5 రూ. 'నవయుగ' అభివృద్ధికి అధమం 500 రూ. లయిన

(మిగతా 28 వ పేజీలో)

విద్యార్థులం తిరిగి పాఠశాలల్లో ప్రవేశిస్తున్నాం. యుద్ధానంతర భారత ప్రజల విప్లవ పోరాటాల ఫలితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు **1948 జూన్**నాటికి భారత దేశంనుండి మూటా ముల్లెకట్టుకు **పోతా**మని చెప్పకతప్పిందికాదు. **1948 జూన్** సరిగా సంవత్సరంకూడా లేదు. ప్రతి విద్యార్థీ ఆనాటికి సామ్రాజ్యవాదాన్ని ఎలా సాగనంపాలా అని ఆలోచిస్తున్నాడు. కాని మరియొక ప్రక్క సామ్రాజ్యవాదులు మాత్రంతమ కుటిల ప్రయత్నాలను మానలేదు. పైగా దేశంలో మతకలహాలను రెచ్చగొట్టారు. ఈ అంతర్యుద్ధం ఉన్నతస్థాయికి పోతున్న కొద్దీ సామ్రాజ్యవాదుల్లో ఉత్సాహం అధికమవుతూంది జాతీయోద్యమాన్ని దెబ్బగొట్టటానికి నూతన ప్లానులు తయారుచేస్తున్నారు. ఈ ఫలితమే జూన్ 3 న దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తూ వైస్రాయి ప్రకటించిన ప్రణాళిక. ఈ ప్రణాళిక ఫలితంగా దేశంలో అంతర్యుద్ధము అంతిమదశకు కొనిపోబడుతుంది. సామ్రాజ్యవాదం తనతాబేదార్లయిన సంస్థానాధీశులను "స్వతంత్రులు"గా ప్రకటిస్తూంది. ఈప్రణాళిక విభజనద్వారా భారత దేశాన్ని ఆర్థికంగా, సైనికంగా బలహీనపరచి, తమ కనువగు షరతులతో భారతదేశాన్ని తమముందు పాదాక్రాంతం చేయించాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కుట్రలు పన్నుతున్నారు. అందుకు ప్రథమ సోపానంగా సంస్థానాధీశులను, పెట్టుబడిదారులను ఉపయోగించుకోవాలని చూస్తున్నారు.

తమహక్కుల కొరకుపోరాడుతున్న తెలంగాణా ప్రజలపై అమలుజరుప బడుచున్న నిర్బంధవిధానం, వీటివెనుకనున్న బ్రిటిష్‌వాళ్ళ అండ పై విషయాల్ని స్పష్టపరుస్తున్నాయి. పైపెచ్చు సంస్థానాలు స్వతంత్రమని పేరుచెప్పి స్వదేశిసంస్థానాల నెల్ల బ్రిటిష్ అయుధ కర్మాగారాల క్రింద మారుస్తున్నారు. నేడునైజాంలో నిర్మింప బడుచున్న యుద్ధపరిశ్రమలే యిందుకు నిదర్శనం.


మనజాతీయోద్యమ శక్తివల్ల అధికారాన్ని 1948 జూన్‌కల్లా భారతీయుల కప్పగిస్తామని సామ్రాజ్యవాదులు ప్రకటనలుచేసినా, నిజమైన స్వాతంత్ర్యానికీ, ఈప్రకటనలకూ చాలావ్యత్యాముంది. సామ్రాజ్యవాదుల కుట్రలన్నిటినీ ఓడించి అధికారాన్ని నిజంగా భారతీయులు హస్తగతం చేసుకోవటమనేది మనబలంపైనే ఆధారపడిఉంది. విద్యార్థులం బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల కుట్రలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తూ, సామ్రాజ్యవాద ప్రయత్నాలను ఓడించటానికి జాతీయోద్యమం తీసుకొనే ప్రతి

విద్యార్థి ఫెడరేషన్‌లో

చర్యను మనంబలపర్చవలసియున్నది. విద్యార్థి ఫెడరేషన్ ఈదృక్పథంతో విద్యార్థులను ప్రజలను జాతీయోద్యమాని కండగాసమీకరించటానికి అగ్రగామిగా ఉంది, సామ్రాజ్యవ్యతిరేక పోరాటాల్ని సాగించటానికి కంకణం కట్టుకున్నది. ఇట్టి అపారమైన భారాన్ని చరిత్ర భారత విద్యార్థిలోకంపై వేసినపుడు మన నూతన సంవత్సరంప్రారంభమవుతూంది.

విద్యావిషయాలు

ఇక మనవిద్యావిషయాలు ఆలోచిస్తే ఎన్నోకఠోర సమస్యలు నేడు మన నెదుర్కొం



జి. జగన్నాధ రెడ్డి
అధ్యక్షుడు, ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్

టున్నాయి. జాతీయ విద్యావిధానాన్ని అమలు పరుస్తామని కంకణం కట్టుకొన్న కాంగ్రెసు మంత్రివర్గంసంవత్సరకాలంనుండిఅధికారంలో నున్నప్పటికీ బానిస విద్యావిధానం నేటికీమన విద్యాలయల్లో కొనసాగుతూంది. సంవత్సరం నుండి విద్యార్థులు, ప్రజలు ఐక్యమై ఆందోళన చేయుచున్నా, నేటికీ డిటెన్షన్‌లాంటి అభివృద్ధి నిరోధక పద్ధతులను మననెత్తిన రుద్దుట జరుగుతూంది.

తిండికి చాలని జీతాలచే అసంతృప్తికలిగి వేరుగత్యంతరం లేక హైస్కూలు ఉపాధ్యాయులెల్లరూ సమ్మెకు సిద్ధపడుతున్నారు. ఈ పరిస్థితులు నేడు వున్న విద్యావిధానాన్నే తారుమారుచేస్తున్నాయి. ఇక సీట్ల విషయం ఆలోచిస్తే టెక్నికల్ కోర్సులకు వేలకొలది విద్యార్థులు హాజరవుటకు అభిలాషపడుచున్నప్పటికీ ప్రభుత్వంమాత్రం ఈ సమస్యనుపరిష్కరించుటకు తగిన శ్రద్ధ తీసుకోవటంలేదు. కాలేజీల్లో సీట్లు సంపాదించుటయే మహా ప్రళయంగా ఉంది. సీటు దొరికినా కోరిన గ్రూపుకు ప్రవేశంలేదు. హైస్కూళ్ళలో వందలకొలది విద్యార్థులు సీట్లులేక నానా ఇక్కట్లులకు లోనవుతున్నారు ఈ బాధలన్నీపడి చివరకుఒకసీటు ఎలాగో సంపాదించ గల్గినా, విద్యాలయాలలోని పరిస్థితులు అతిఘోరంగా నున్నవి. ఏపాఠశాలలోను అనువైన పరికరాలుండవు, కావలసినంతమంది ఉపాధ్యాయులు లేరు. టెక్స్టు పుస్తకాలు స్కూలు తెరచిన మూడు నెలలకు ప్రత్యక్షమవుతాయి.

జీతాల పెంపుదల

ఈ పరిస్థితులు చాలవన్నట్లు మంత్రివర్గం హైస్కూళ్ళలో పదవనెల జీతాలను ఏర్పరచారు. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లోని జీతాలు హెచ్చించ నిర్ణయించాయి. ప్రవేశరుసుము కాండొనేషన్ ఫీజుపెంచటమయింది. నేటివిద్యావిధానం చాలావ్యయంతోకూడుకొన్న దగుటచే బీద, మధ్యతరగతి బాలురు విద్యనభ్యసించలేక పోతున్నారు. నేటి యీ జీతాల పెంపుదల మధ్యతరగతి విద్యార్థులకు గొడ్డలిపెట్టు కాగలదు. ప్రజాసామాన్యానికి విద్యనేర్పుటకు కాంగ్రెసు కంకణం కట్టుకొని యుండగా ఈ ప్రధానాశయాన్నే దెబ్బగొట్టునట్లు కాంగ్రెసు మంత్రివర్గమే జీతాలను పెంచుట సహించరాని విషయం. విద్యార్థులం ఐక్యమై పైవిద్యా సమస్యను పరిష్కరించుటకు ముందుకు రావాలి. నిరుటి సంవత్సరం ఆంధ్ర విద్యార్థులం ఐక్యమై డిటెన్షన్ విధానాన్ని ఎదిర్చిపోరాడాం. దీని ఫలితంగా పోలీసునిర్బంధ విధానాన్ని కూడ లెక్కచేయక, అనేక విజయాలు సాధించాం. రాష్ట్రంలో ఎచ్చటా నూటికి 15 గురికి మించి డిటైన్ చేయబడకుండునట్లు చేయగలిగాం. షుమారు 350 మంది డిటైన్ అయిన విద్యార్థులను తిరిగి పరీక్షలకు పంపగలిగాం. 4000 మందివిద్యార్థులపై వేసిన జరిమానాలనురద్దుచేయించగలిగాం. డి. పి. ఐ. సిండికేట్ మున్నగు విద్యాశాఖలు విద్యార్థి హక్కులను కాలరాస్తూ పంపిన నిరంకుశ సర్క్యులరులను బుట్టదాఖలు చేయించగలిగాం.

సభ్యులుగ చేరండి



మల్లవరపు రామకృష్ణరావు
కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషన్

మన విజయాలు

ఆంధ్రవిద్యార్థిలోకం యీ విజయాల్ని ఎలా సాధించగల్గింది? ఆచరణలో విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థికాంగ్రెస్ మధ్యనున్న వైరుధ్యాలను మరచి విద్యార్థిఐక్యతనిర్మించారు. ఇట్టిఐక్యతసాధించిన ప్రదేశములలో నెల్ల అధికారుల బెదరింపులు, పోలీసుల లాఠీచార్జీలు నిష్ప్రయోజనమయ్యాయి తనజీవితంలో ఓటమెరుగనని చెప్పుకొనే బందరు ప్రిన్సిపాల్ కూడ అక్టోబరు సమ్మెనాటి విద్యార్థుల ఐక్యతకు లొంగిరాక తప్పిందికాదు విద్యార్థిఫెడరేషన్, విద్యార్థికాంగ్రెసులు జనవరిసమ్మెనాటికి బందరులో చీలిపోవుటచే ప్రిన్సిపాల్ తిరిగి తనకత్తిని ఝుళిపించగలిగాడు వందలమంది విద్యార్థిజీవితాలను బలిగొన్నాడు. పైవిషయం గమనిస్తే విద్యార్థులు ఐక్యతను సాధిస్తే వారి నెదిరించగలశక్తి లేదనీ, అనైక్యత మనలో ప్రబలితుంటే నిరంకుశవిద్యాధికారులు మన జీవితాలతో చెలగాటమాడుతారనీ స్పష్టపడుతూంది.

విద్యార్థి ఐక్యత

నేడు మనల్ని ఎదుర్కొంటున్న పరిస్థితులు చూస్తే గట్టిపునాదులచే నిర్మింపబడిన విద్యార్థి ఐక్యతను నెలకొల్పవలసిన ఆవశ్యకతను ఇదివరకటి కంటె హెచ్చుగా నున్నదని ప్రతిఒక్కరూ గుర్తించగలరు. కాని విద్యార్థి కాంగ్రెసునాయకులు ఇందుకు భిన్నమయిన మార్గాన్ని అవలంబిస్తున్నారు. విద్యార్థి ఫెడరేషన్‌తో ఐక్యత పనికిరాదని సర్క్యులరును జారీచేసింది. విద్యార్థి హక్కుల కొరకు పోరాడుటకు ఐక్య కార్యాచరణ సంఘాలను ఏర్పరచుకొన్న ప్రదేశాలలో వాటిని విచ్ఛిన్నంచేయ ప్రయత్నించారు. విద్యార్థికాంగ్రెస్ నాయకత్వంయొక్క ఈ పంధాను వ్యతిరేకించి స్థానికంగా విద్యార్థి ఐక్యతకొరకు పాటుపడిన విద్యార్థి కాంగ్రెసు సోదరులకు మా అభివందనాలు. ఇట్టి ఐక్యతను నేటి సమస్యల పరిష్కారానికి ఇంకా ఎంతో ముందుకు తీసుకుపోవలసిన ఆవశ్యకత ఉండదా? విద్యార్థి కాంగ్రెసు నాయకత్వం ముఠాతత్వ రాజకీయాలలోకి తమ సంస్థనుదించి, తద్వారా ఏర్పడిన చీలికలను ఉపయోగించుకొని, విద్యార్థుల నెదుర్కొనుచున్న ప్రధాన సమస్యలపై నుండి విద్యార్థి కాంగ్రెసు వర్కర్ల దృష్టిని వెనక్కు మరల్చగలిగారు. విద్యార్థి ఉద్యమ శ్రేయస్సును గోరి ఈ ముఠాతత్వ రాజకీయాల నుండి బయటపడి విద్యార్థి ఉద్యమ ఐక్యతా నిర్మాణానికి ముందుకు రావలసిందని విద్యార్థి కాంగ్రెస్‌సభ్యులకువిజ్ఞప్తి చేస్తున్నాం అప్పుడే విద్యార్థుల నెదుర్కొన్న సమస్యలను పరిష్కరించగలం. నిరంకుశ విద్యాలయాధికారులు విద్యార్థి ఉద్యమంపై సాగించిన దాడికి తగిన పాఠంనేర్పగలం

విజ్ఞప్తి

విద్యార్థి ఫెడరేషన్ పై విద్యార్థి హక్కుల రక్షణకు, సామ్రాజ్యవాదుల కుట్రలను భగ్నపరచుటకు, తన శక్తికొలదీ కృషి చేస్తుందని ప్రతిజ్ఞ చేయుచున్నాం నిరుడు ఆంధ్ర విద్యార్థిలోకం జరిపిన డిటెన్షన్ వ్యతిరేక



యస్. వి. నరసయ్య
సహాయ కార్యదర్శి,
అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్

పోరాటాల్లో విద్యార్థి ఫెడరేషన్ వర్కర్లు ముందుండి నిర్బంధ విధానాన్ని ఎదిరించారు. లాఠీచార్జీలకు అరెస్టులకు గురైనారు. నేటికీ బందరులో 25 మంది విద్యార్థి ఫెడరేషన్ వర్కర్లపై కేసు సాగుతూంది.

నిర్బంధవిధానానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడుటకై ప్రతి విద్యార్థీ ఫెడరేషనును బలపర్చాల్సివుంది. విద్యార్థి ఐక్యతను కోరే ప్రతి విద్యార్థీ విద్యార్థి ఫెడరేషనులో సభ్యుడుగా చేరాలి. విద్యాలయాలలో సరైన విద్యా వసతులకొరకు పోరాడుటకు, బానిస విద్యావిధానానికి స్వస్తిచెప్పుటకు, అధిక జీతాలను రద్దు చేయించుటకు ప్రతివిద్యార్థి విద్యార్థి ఫెడరేషన్ జెండాక్రింద ఐక్యమవ్వాల్సి ఉంది.

బలమైన విద్యార్థి ఫెడరేషన్ నిరంకుశ విద్యాలయాధికారుల గుండెల్లో రాయి. ప్రతి ఆంధ్ర విద్యార్థీ, విద్యార్థి ఫెడరేషన్ ప్రాథమిక సభ్యుడుగా జేరి ఆంధ్ర విద్యార్థి ఉద్యమాన్ని నూతన స్థాయికి గొనిపోవాల్సిందిగా విజ్ఞప్తి చేయుచున్నాము.

— ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషన్

చిన్న కథ

ఆత్మార్పణ



పినిశెట్టి శ్రీరామమూర్తి

ప్రశాంతంగా వున్నంతసేపూ వుంది నారాయణదాసు గట్టిగా నిట్టూర్చాడు. ఆవేడికి వల్లగా పెరుగుతోన్న నూగు మీసాలుకూడా చలించాయి.

ఆ నిట్టూర్పు ధ్వనికి కమల విషాదంగా ఉన్న తన మొగాన్ని భర్తకేసి త్రిప్పింది. ప్రశ్నార్థకంగా చూసింది. మంచంపైనున్న భాను పదినెలల బిడ్డడు. భానితెలిసిన యోగిలా నిద్దట్లో చిఱునవ్వులు చిలకరిస్తున్నాడు. "అమ్మేది" అని ప్రశ్నించాడు దాసు కమలకేసి చూస్తూ, "మీర్జాయింటికి వెళ్ళింది."

భార్య సమాధానానికి ఆశ్చర్యంగా మొదట చూచి, వెంటనే మొగం చిట్లించి "యివి పూర్వపు రోజులుకావనే నమ్మకం ఆమెనుండి పోలేదూ ?" అన్నాడు. అతని కంఠం బాధగా గట్టిగా శబ్దించింది. కమల సమాధానంగా,

"మతభేదాలకు మించింది వాళ్ళస్నేహం. ఒకతల్లి బిడ్డల్లా ఉండడం మొదట్నుంచీ చూస్తున్నారుగా. వయసుమించిన వాళ్ళిద్దరి స్నేహాన్ని. మత ద్వేషాలతో వుండేవాళ్ళు చూస్తే, బుద్ధితెచ్చుకోవలసిన బాధ్యత ఏర్పడుతుంది" అంది.

దాసు తిరిగి సమాధానం యివ్వలేదు అతని చిత్తం ప్రస్తుతవాతావరణానికి దూరమైంది.

హిందూ - ముస్లిం ఏక్ హో ! అంటూ ఉభయపక్షాలూ కొట్లాటకు కాలుదువ్వేముందు, ఎంతో ప్రచారం చేశాడు మత సామరస్యం కోసం దాసు.

నౌఖాలీజిల్లాలో కమలపూర్‌లో దాసు నివాసం. అతను చేసిన ప్రచారం, పడ్డప్రయాస, ఆ ప్రాంతంలో మట్టుకు బూడిదలో పోసిన పన్నీరయింది.

రోజురోజూ వింటూన్న వార్తలవల్ల దాసు మానసికనిర్ణయం తప్పేమోననే సందిగ్ధంలో పడ్డంకూడా తటస్థించింది. దూరాన్నుండి "కొట్టు ! చంపు, నరకు !" అనే ఉద్రిక్త నాదాలు హఠాత్తుగా మిన్ను ముట్టాయి,

నిద్దట్లో ఉన్నభాను తృళ్ళిపడి కెవ్వున అరచాడు. కమల భానుని హృదయానికిహత్తుకుంది.

నారాయణదాసు నాలుగు రెక్కలుగల కిటికీ నుంచి పైనుండే ఒకరెక్క తెరచి హృదయ విదారకమైన ఒక దృశ్యాన్ని చూస్తున్నాడు.

ఒక యువకుని పదిమంది వెనకమాటున వచ్చి పొడిచారు. రక్తధారల్తో అసహాయంగా కాపాడమని అర్థిస్తున్నా, నిర్దయగా మరో రెండు పోట్లు పొడిచారు.

దాసు అప్పటికాలం చూడలేక పోయాడు. తలతిప్పుకొని బాధగా రెండుకళ్ళూ గట్టిగా మూసుకున్నాడు

బిడ్డకు పాలిస్తూ "ఏమిటదీ" అనిఅడిగింది కమల. కళ్ళుతెరచాడు. "ముస్లింజాతి దౌర్జన్యము" అనిచెప్పడంలో అతనికళ్ళు ఎర్రబడి కంఠం పెద్దదిగా వినిపించింది "ఊ"అంటూ తలపంకించింది. ఆయాసంగా ఒక్కసారి గాలి గట్టిగాపీల్చి నెమ్మదిగా విడచింది, ఆమె కళ్ళల్లో నీటి తెరలు కనపించాయి, నిగ్రహతవల్ల కాటోలు మరుక్షణాన్నే మాయమయ్యాయి,

"అమ్మరాలేదూ ?" మళ్ళీఅడిగాడు దాసు,

కమల సమాధానం చెప్పలేదు. ఆలోచనగా ఎదురుగా ఉన్న గడియారంకేసి చూస్తోంది,

కాస్సేపు గడియారం "టిక్ - టిక్" ధ్వని తప్ప మరోశబ్దం వినిపించలేదు.

"ఎంతస్నేహమైనా ముస్లింజాతిని మన వాళ్ళుగా అనుకోవడం చాలా పొరపాటు...." కాలును కక్షగా నేలకురాసి, వెళ్ళి వాలుకుర్చీలో కూర్చున్నాడు దాసు.

"అందరూ అలావుండరు" అనినెమ్మదిగా అందికమల. వెంటనే కుర్చీలోనుంచి ఎదరకు వంగి "ఆ సహన గుణమే హిందూజాతిని సమూలంగా నాశనం చేస్తూంది....ముస్లిం—ముస్లిమే....హిందూ—హిందువే; వీళ్ళకు వాళ్ళు ఆజన్మ విరోధులు" పిడికిలి బిగబట్టి కుర్చీ కమ్మపై గుద్దాడు.

కమల దీర్ఘంగా భర్తమొగంకేసిచూస్తోంది.

దాసు తిరిగి ప్రారంభించాడు, "ఈనౌఖలీ జిల్లాలో ముస్లిం జాతి చేస్తోన్న అఘాయిత్యాలు మరుపురానివి. వాళ్ళ బలగంపెద్దది.... కాన దానికి ప్రతిఫలంగా హిందూ మెజారిటీ ప్రాంతాలు ఏంచేస్తవో తెలుసా ?". అంతటితో ఏదోసంశయం అంతర్యంగా ఎదురోక్కడం వల్ల ఆగిపోయాడు. ఎదురుగావున్న గోడకేసి చూశాడు. మీర్జాకొడుకు కరీం, తనూ, కలసి ఫొటో తీయించుకున్న గతంరోజులు గు... కొచ్చాయి, ఎదురుగా ఆఫొటో కనిపిస్తోం...

వెంటనే కుర్చీనుండిలేచి గోడను... ఆ ఫొటోనులాగి, విసిరి నేలకేసి కొట్టాడు.

భాను మరోసారి తృళ్ళిపడ్డాడు, కమ... పాపాయినిఅదిమిపట్టుకొని, భర్తకేసిచూచిం...

"మీరుకూడా మత విద్వేషులౌతున్నారు..." అని మందలింపుగా అంది.

క్రిందపడిన పటంకేసి చూశాడు దాస... తెల్లటి ఆ పై గ్లాసుమటుకు మంచుముక్క... చెల్లాచెదరైంది. చత్రంమటుకు చలించలే... క్రితంకన్నా ఫొటో విస్పష్టంగా కనుపిస్తోం... వాళ్ళ స్నేహానికి భిన్నం లేనట్లు సగర్వం... చేతులూ చేతులూ కలుపుకొని, కరీం - దా... ఆ ఫొటోలోనుంచి చూస్తున్నారు.

తిన్నగా కిటికీ దగ్గరకు వెళ్ళాడు దాస... వీధికేసి చూస్తున్నాడు. ఆ యువకుని శరీ... రక్తసిక్తమైంది. రక్తం పారి గడ్డకట్టిం... కాకులూ, రాబందులూ వ్రాలుతున్నాయి. ... తిప్పాడు.

కమలకేసిచూస్తూ "వాళ్ళు చేసే సమ... మతంపైకాదు, మానవజాతిపై....", అ... కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మళ్ళీ కిటికీ... చూశాడు.

ఒక కుక్క కాకులపై, రాబందులపై అధి... రాన్ని చలాయిస్తోంది. మరోకుక్క శవా... అప్యాయంగా నాకుతోంది

భడాలున కిటికీనిమూసివేశాడు, కళ్ళురెం... తుడుచు కున్నాడు దాసు.

"మీ మనస్సు చాల చికాకుగా వుందికదూ" అని ప్రశ్నించింది కమల.

"ఎందుకుండదూ ! వుంటుంది. నే... క్రితం హిందూ - ముస్లింలు ఒక్కజాతివాళ్ళ... అనుకొని పొరబడ్డాను.... బ్రిటిష్‌వాళ్ళక... ముందు భారతదేశం వలనవచ్చింది ఈ ము... జాతేనని, వాళ్ళ కత్తులే నా హృదయం...

(మిగతా ప్రక్కపేజీలో)

రాయలసీమ విద్యాభివృద్ధి
★ ప్రభుత్వ కర్తవ్యం ★

ఆంధ్రదేశంలో కల్లా అత్యంతంగా విజ్ఞాన విద్యావిషయాలలో వెనుకబడిన జిల్లాలురాయలసీమ జిల్లాలు. ఆంధ్రప్రజలెల్లరూ కలసి రాష్ట్ర సిద్ధికి సామ్రాజ్యవాదుల కెదురుగా పోరాడకుండా చీలికలుకల్పించుటకు సామ్రాజ్యవాదులు ఆంధ్రప్రజల జీవితంలో అసహజమైన హద్దులు పెట్టారు. రాయలసీమ జిల్లాలను సర్కారు జిల్లాలకన్న ఆర్థికాభివృద్ధిలో వెనుక నుంచారు. తద్వారా సర్కారు - రాయలసీమ విభేదాలు రెచ్చగొట్టి రాష్ట్ర సిద్ధిని విరోధించాలని సామ్రాజ్యవాదుల కుట్ర.

సంవత్సరముల అధ్వాయిజర్ల పరిపాలనానంతరం కాంగ్రెసు మంత్రివర్గం అధికారం స్వీకరించగనే యీ కృత్రిమ భేదములను మాపుమాపుటకు కృషి సల్పుతారని ఆశించాం. రాయలసీమ జిల్లాలు విద్యావిషయాలలో వెనుకబడి యుండుటచే ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధకు పాత్రమవుతాయని తలచాం. కాని అనుభవం వేరొక విధంగామారింది

కాంగ్రెసుమంత్రివర్గంయొక్క హయాంలో అనంతపురం జిల్లాలో 200 ప్రాథమిక పాఠశాలలు. డబ్బు లేవన్న సాకుతో మూసివేయబడినవి. రాష్ట్రంలో ఒక ప్రక్క నిర్బంధ ప్రాథమిక విద్యను అమలుపర్చుటకు ప్రభుత్వ ప్లానులు! కాని మరియొక ప్రక్క ఉన్న ప్రాథమిక పాఠశాలలనే మూసివేయుట జరుగుతున్నది! ఈ 200 ప్రాథమికపాఠశాలలు నడపుటకు డబ్బులేదట! ప్రభుత్వం తపెట్టిన ప్లానులన్నింటికీ, - పోలీసులను హెచ్చుజేయుటకు, జమీందార్లకు నష్టపరిహారం యిచ్చుటకు-డబ్బుయున్నది! ఇక డబ్బుకొరత అల్లా 200 ప్రాథమిక పాఠశాలలు నడుపుటకు కావలసిన ఒక లక్ష రూపాయలు సంపాదించుటలోనే!

ఇక ఉన్నతవిద్య తీసుకుంటే -రాయలసీమ జిల్లాలలో ఆనర్సు కోర్సులుగాని. టెక్నికలు కళాశాలలుకాని నేటివరకూలేవు. వీనికొరకు విద్యార్థులుమద్రాసుకోలేక వాల్తేరునకోపోవాల్సి వస్తుంది. కొద్దిమంది భాగ్యవంతులు మినహా మరియెవరూ యిందుకు నోచుకోలేదు. ఇట్టి కోర్సులను రాయలసీమ జిల్లాలలో పెట్టవలయునని చాలాకాలమునుండి ఆందోళన యున్నది. ప్రజల కండ్లనీళ్ళుతుడుచుటకా యన్నట్లు ఒక యింజనీరింగు కళాశాల నిచ్చారు. కాని అది మద్రాసులోనే పెట్టి నడుపుట జరుగుచున్నది. కళాశాల రాయలసీమకని నిర్ణయించి రెండవ సంవత్సరం వచ్చినా - రాయలసీమకు మార్చుటకు ఎట్టి ప్రయత్నం జేయుటలేదు.

నేటికికూడ కడపజిల్లాకు కాలేజీయేలేదు. స్కూలుఫైనలు ప్యాసై బయటజిల్లాలకు పోయి, అచ్చట విద్యార్థులు వ్యయప్రయాసలకు లోనుగావలసి వచ్చుచున్నది. ప్రజాందోళనను గమనించి బి. యస్. సి కోర్సులను అనంతపురం కళాశాలలో ప్రభుత్వం ఏర్పరచినా ఆనర్సు కోర్సులను ప్రభుత్వం స్థాపించే ప్రయత్నం చేయలేదు.

రాయలసీమ విద్యార్థుల సౌకర్యమునకని వైద్యకళాశాల, వ్యవసాయ కళాశాలలు అనువయిన ప్రదేశంలో రామయలసీమజిల్లాలలో స్థాపింపవలయుననెడి ఆందోళన సంవత్సరములనుండి ఆందోళనగానే యున్నది.

కాంగ్రెసు మంత్రివర్గం రాయలసీమజిల్లాల ప్రజలవిద్యావసతులను గుర్తించి అనంతపురమునకు యింజనీరింగు కళాశాలను వెంటనే మార్చుఏర్పాట్లు జేయింతురని ఆశించుతాం. నూతన టెక్నికలు కళాశాలలు, కడపలోఆర్టు కాలేజి ఎట్టికాలయాపనా చేయకుండా ప్రారంభించ సమకట్టుతారని తలంచుతాం.

ఈ సమయంలో రాయలసీమవిద్యార్థి సోదరులపైగూడ ప్రత్యేక భాధ్యతయున్నది. మన జిల్లాల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పూనుకొనుటకు బలమైన ఉద్యమం మనజిల్లాలలోనిర్మించుట అత్యవసరం. బలమైనవిద్యార్థిఉద్యమాన్ని నిర్మించుకొనిమనమీఆందోళనప్రారంభించిన ప్రభుత్వం మనకోర్కెలుగమనించక తప్పదు. అందుకు ప్రతిరాయలసీమ విద్యార్థీ తమ హక్కుల కొరకు, యితర ఆంధ్రజిల్లాలలో పోరాడుతున్న విద్యార్థిసోదరులను ఆదర్శంగా తీసుకొందురని ఆశించుతాం. మనం మనసమస్యలపై ఆందోళన ప్రారంభించితే-రాయలసీమ ప్రజలేకాదు-యావదాంధ్రజాతి మనఉద్యమాన్ని బలపర్చుతుంది. అందుకు మనంతదలి మనప్రాథమిక కర్తవ్యమును నిర్వహించవలసియున్నది.

బి. గోపాలకృష్ణ,
ఉపాధ్యక్షుడు, ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషన్.

(ప్రక్క పేజీ తరువాయి)

గిచి చెబుతున్నాయ్........ ఆ మాటమాత్రం ఆజన్మాంతం మరవలేను" మళ్ళీ కుర్చీలో కూలబడి డాబాపైకి చూస్తున్నాడు దాసు.

దాసుతల్లి రమాదేవి వగురుస్తూ గదిలోకి వచ్చింది, ఆమె మొగం భయభ్రాంతా మిళితమై. యుంది,

"ఏమిటమ్మా" కుర్చీనుండి లేచి ఆత్రంగా అడిగాడు.

"మాట్లాడకు, గూండాలు వస్తున్నారు" అంది రమాదేవి.

కమల బిడ్డను చంకను వేసుకుంది.

గూండాలు వచ్చి వీధి తలుపు మోదుతున్నారు.

మీర్జా దొడ్డిగుమ్మంలోంచి పరుగునవచ్చి గదిలోకి చేరింది.

దాసు కంగారుగా "కత్తితెచ్చావా?" అన్నాడు.

"ఎందుకూ?" అని అదేస్థాయిలో అడిగింది మీర్జా,

"మీవాళ్ళకు సాయం" అంటూ కసిగా చూశాడు,

మీర్జా మౌనముద్ర వహించింది.

"తప్పు నాన్నా! మీర్జా మనలను కాపాడ్డానికి వచ్చింది" అంది రమాదేవి.

వీధి తలుపు విడిపోయింది. ఒకరి తర్వాత ఒకరుగా గూండాలు యింట్లోకి వస్తున్నారు,

గదిలో మూలగా ఒదిగి నిలబడింది ఆ హిందూ కుటుంబం.మీర్జా గది తలుపుదగ్గరగా నిలబడి ధైర్యంగా చూస్తోంది. మనుష్యలను గుర్తించలేని గూండాలు - హిందూ గృహంలో వున్న మీర్జాను ఒక్కపోటు పొడిచారు.

"అల్లా"అని బాధగా అరుస్తూ గుమ్మానికి జారబడింది మీర్జా.

గూండాలు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఆ బాధలో నెమ్మదిగా యిలా అంది. ఇది ముస్లింలు ప్రస్తుతమున్న ఇల్లు.

మీర్జా మాటలు విన్న గూండాల విశ్చితంగా వెళ్ళిపోయారు. మీర్జా బాధగా గుమ్మాన్నుండి జారి వాలిపోతుంటే; రమాదేవి "బహన్" అంటూ ఆమెను ఆలింగనం చేసుకొంది.

తిరిగి సమాధానం మీర్జా నోటినుండి రాలేదు.

నారాయణదాసు కళ్ళల్లో నీళ్ళు నిల్చాయి. అవి ఆనంద బాష్పాలో-అశ్రుబిందువులో చెప్పలేం. నెమ్మదిగా మాత్రం "ఆత్మార్పణ"అని అనుకున్నాడు.

ఇండోనేషియా స్వాతంత్ర్య



మిస్. జెట్టిజియాన్
ఇండోనేషియా సోషలిస్టు
యువజన సమితి ప్రతినిధి

మొన్న ఢిల్లీలో జరిగిన అఖిలాసియా దేశాల మహాసభకు వచ్చిన ఇండోనేషియా ప్రతినిధివర్గాన్ని చూడగానే ప్రతివారికీ ఒక విషయం తట్టుతుంది. ప్రతినిధివర్గంలో అధిక సంఖ్యాకులు యువజనులు, విద్యార్థులు. వయస్సుముదిరిన మహానాయకులుండగా ఈ యువతీ యువకులు దేశానికి ప్రాతినిధ్యం వహించే అర్హత నెలా సంపాదించుకున్నారా అని ఆశ్చర్యం కలుగకమానదు. ఇందుకుసమాధానం ఇండోనేషియా స్వాతంత్ర్య సమరంలో యువజనులు నిర్వహించిన వీరోచితపాత్రను పరిశీలించితే తెలుస్తుంది.

విప్లవంతో స్వాతంత్ర్యం సాధించారు


1944 సంవత్సరం ఆగస్టు 17 ఇండోనేషియా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపబడిన దినం. సాయుధవిప్లవంతో జపాను హంతకుల తుదముట్టించిన దినం 350 సంవత్సరాలనుండి డచ్చి సామ్రాజ్యవాదుల నాజీ పరిపాలనక్రింద నలిగిపోతున్న ఇండోనేషియనులు స్వతంత్ర రిపబ్లిక్‌ను సాధించుకున్న సుదినం. కాని ప్రజాస్వామికాన్ని నాశనం చేసి తమ పరిపాలనను సుస్థిరం చేసుకోవాలని చూసే సామ్రాజ్యవాదులు, ఇండోనేషియా రిపబ్లిక్‌కు దినదినం గండాలు కల్పిస్తూవచ్చారు. డచ్చి, బ్రిటిషు సామ్రాజ్యవాదుల సాయం తెచ్చుకున్నారు. అది చాలక లొంగిపోయిన **జపాను సైనికులనుకూడ ఉపయోగించారు.**

యువజనుల అచంచలదీక్ష


అలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో స్వాతంత్ర్య సందేశాన్ని ప్రతి పౌరునివద్దకు తీసుకువెళ్ళడమెంతో అవసరం. ఇది చాల కష్టమైనది. ప్రమాద పూరితమైనది. కాని యువకుల దీక్ష ముందీ ఆటంకాలేమిపనిచేస్తాయి? స్వాతంత్ర్య సందేశాన్ని ప్రతి పౌరునివద్దకూ తీసుకువెళ్ళాలని దీక్షవహించారు, వెంటనే వందల కొలది యువకులు వార్తావాహక దళాల్లో చేరారు. వాడవాడలా స్వాతంత్ర్య జెండా నెగురవేశారు. వీధివీధినా స్వాతంత్ర్య సందేశాన్నంటించారు. చదివారు. యువజనులు, కార్మికులు, కర్షకులు కలసి బ్రహ్మాండమైన సభలు గ్రామగ్రామాన జరిపి స్వాతంత్ర్య రక్షణకై ప్రమాణం తీసుకున్నారు. వందలాది ప్రజలీ కార్యక్రమంలో ప్రాణం కోల్పోయారు. కాని వారి దీక్ష అచంచలంగానే ఉంది.

స్వాతంత్ర్య సైన్యం

స్వాతంత్ర్య ప్రకటనానంతరం రిపబ్లిక్‌ను నాశనంచేయాలని చూస్తున్న డచ్చి-బ్రిటిష్ కుట్రలను భగ్నంచేయడానికి ఇండోనేషియన్లు పూనుకున్నారు. రిపబ్లిక్ రక్షణకై ప్రతిపౌరుడూ పూనుకోవాలని పిలుపివ్వబడింది. సుసంఘటితమయినది కాకపోయినా వెంటనే ప్రతిఘటనోద్యమం ప్రారంభమయింది. యువజనులైన స్త్రీలు, పురుషులు కలసి ప్రతిఘటన దళాలుగ యేర్పడ్డారు, మొదట్లో రిపబ్లిక్‌కు స్వాతంత్ర్య సైన్యమంటూ లేదు. ఈ స్వతంత్ర దళాలన్నీ ఒకే కేంద్ర నాయకత్వంక్రింద సంఘటిత పరచబడినవి, ఈ సంఘటిత సైన్యమే రిపబ్లిక్ సైన్యం. యువజనులుమాత్రమీ కేంద్ర నాయకత్వంక్రింద "లాస్కార్స్" అనే పేరిట ప్రత్యేకంగా వ్యవహరించేవారు. రిపబ్లిక్ సైన్యంలో నూటికి 90 మంది యువజనులే. యుద్ధరంగంలోకూడ యువజనులదే ప్రముఖపాత్ర. ఇండోనేషియా చరిత్రలో ప్రసిద్ధికెక్కిన "సౌరబ్యా", "జోగ్జాకార్టా" యుద్ధాల్లో అసమాన ధైర్యంతో వీరోచిత ప్రతిఘటన సాగించింది యువజనులే. శత్రువుకు వీరికన్న యెన్నోరెట్లు ఆయుధసంపత్తి ఉంది. విమాన బలంకూడ ఉంది. యువజనులు ధైర్యసాహసాలతో వీధివీధినా, ఇంటింటా శత్రువును ప్రతిఘటించారు. 'జోగ్జాకార్టా', 'సౌరబ్యా' లు



ఇండోనేషియన్ యువకులు యుద్ధరంగానికి....



భారతదేశానికి ఆహారవస్తువులు పంపుతున్న దృశ్యం

పోరాటంలో యువకుల పాత్ర

బ్రిటిషు విమానాల బాంబుల వర్షంతో దగ్ధమైనవి. ఆఖరకు సౌరబ్యా రేవులో ఇండియా కెగుమతి చేయబడనున్న బియ్యపు పడవల మీదకూడ బ్రిటీషు బాంబువర్షాలే. బియ్యంలో మూడు వంతులు నాశనమైపోయాయి.

మృత్యువు నెదిరించి పోరారు

స్వాతంత్ర్య పోరాటంలో వేలకొలది ఇండోనేషియా యువకులు, విద్యార్థులు, కర్షకులూ, కార్మికులు, ప్రాణాలర్పించారు. అయినప్పటికీ ఆయుధబల మెన్నో రెట్లెక్కువున్న శత్రువును ఆరు నెలలు వీరోచితంగా ప్రతిఘటించారు, సైన్యానికేగాకుండా పట్టణాల్లోని ప్రజలకు కూడ ఆరునెలలు సరఫరాలు ఆగిపోకుండా వచ్చాయంటే యువకుల కృషిఫలితమే. ఒక ప్రక్క నెత్తిమీద శత్రువు విడవకుండా బాంబులను వేస్తుంటే మరో ప్రక్క వీరు ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి, ఆహారపదార్థాల, గుడ్డల పంపకం సక్రమంగా సాగేటట్లు చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో సాధించ బడిన యువజనైక్యత తరువాత మరింత దృఢపడింది.

మూడు సంవత్సరాల హోరా హోరి యుద్ధంతరువాత ఇండోనేషియా డచ్చి దేశాల మధ్య ఒడంబడిక కుదిరింది. ఈ ఒడంబడికను గూర్చి ప్రతినిధి వర్గమిలా చెప్పింది. "ఒడంబడికలోని సంధిషరతులను డచ్చివారేవిధంగా అమలు జరుపుతారో చూడాలి. వాళ్ళు సరిగా ప్రవర్తించితేసరి. లేకపోతే వారిపరివర్తనకొరకెదురుచూస్తూ వూరుకోక స్వతంత్ర ఇండోనేషియా నిర్మాణంకొరకు ముందుకు సాగిపోతాం. దేశమంతటా ప్రస్తుతం బ్రహ్మాండమైన పునర్నిర్మాణకార్యక్రమం కొనసాగించ బడుతున్నది.

నిరక్షరాస్యతకు స్వస్తి

నిరక్షరాస్యతా నిర్మూలనం నేడు ఇండోనేషియా యువకుల నెదుర్కొనుచున్న ప్రధాన సమస్య. 350 సంవత్సరాల డచ్చి పాలన ఫలితంగా నేడు చదువుకున్నవారి సంఖ్య నూటికి 7మంది. నేడు మనరాష్ట్రంలో వలెనే అక్కడ కూడ ఉపాధ్యాయుల కొరత యేర్పడింది. సెంకండరీ పాఠశాలల్లోను, కాలేజీలలోను యీసమస్య తీవ్రంగా ఉంది. డచ్చి పరిపాలనలో నూటికి 95 మంది ఉపాధ్యాయులు డచ్చివారే. ఇప్పుడు డచ్చివారి స్థానాల నాక్రమించడానికి. సరిపడ ఇండోనేషియా ఉపాధ్యాయులు కావాలి. ఉపాధ్యాయులను తర్ఫీదు చేసేందుకు చాలినన్ని ట్రెయినింగు కాలేజీలు లేవు. ఇండోనేషియను యువజనులీకొరతను తీర్చడానికై వందల మంది ఉపాధ్యాయులుగా పని చెయ్యడానికై ముందుకొచ్చారు. స్కూళ్ళు కాలేజీలు విడిచిపెట్టిన తరువాత విద్యార్థులు, తమ పని పూర్తియైన తరువాత యువకులు "సాయంత్రపాఠశాల"ల్లో విద్యనేర్పుతున్నారు. యుద్ధకాలంలో కూడ విద్యార్థులు కొంతకాలం యుద్ధరంగంలోను, కొంతకాలం చదువుకని విద్యాలయాల్లోను గడిపేవారు.

ఇండియాకు బియ్యం

జీవన్మరణ పోరాట సమయాలలో కూడ డచ్చి, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పెట్టిన ఆటంకాలను దాటుతూ ఇండోనేషియా మనకు బియ్యం పంపిందనే సంగతి భారతీయుడెవ్వడూ మరచిపోలేడు. ఇందుకు ప్రతి భారతీయుడూ కృతజ్ఞత తెలుపుతాడు. ఇండియాకు ధాన్యం పంపడానికై ఇండోనేషియా యువజనులే విధంగా కృషి సల్పిందీ ప్రతినిధివర్గం వారిలా వివరించారు. "ఇండోనేషియా యువజన సమితి యీ కార్యక్రమాన్ని నెరవేర్చడానికొక ప్రత్యేక సమావేశం జరిపి యువజనులకొక కార్యక్రమాన్నిచ్చింది. ఈ కార్యక్రమంలో తోడ్పడటానికి యువజనులు ప్రత్యేకంగా కొన్ని పాటలు వ్రాశారు. స్త్రీలు పురుషులు చిన్న చిన్న దళాలుగ యేర్పడి గ్రామాలకు వెళ్ళి భారతదేశాన్నెదుర్కొంటున్న ఆహార కొరతను గూర్చి, ఆ కొరతను తీర్చడానికి బియ్యం పంపవలసిన ఆవశ్యకతను గూర్చి ఇండోనేషియను రైతుల్లో ప్రచారంచేశారు. అధికాహారోత్పత్తికై రైతులను ప్రోత్సాహపరిచారు. కోత కోయడంలోను, ధాన్యాన్ని ప్రభుత్వ స్టోర్సు కెగుమతి చేయడంలోను యీ దళాలు రైతులకు తోడ్పడ్డవి. కాని మారుమూలలనున్న గ్రామాలనుండి ధాన్యాన్నెలా యెగుమతి చెయ్యడమనే సమస్య వారి నెదుర్కొన్నది. ఇండోనేషియా ప్రభుత్వమీ ధాన్యాన్ని రేవుల కెగుమతి చేయడానికై బ్రిటిషు లారీల సహాయం అడిగింది. కాని భారతదేశ ప్రజల రక్షణే తన ఆశయమని చెప్పే బ్రిటిషు ప్రభుత్వం లారీలు ఇవ్వ నిరాకరించింది. ఇండోనేషియా యువజనులు మాత్రం తమ దళాలను, ట్రక్కులను వంపి ధాన్యాన్ని రేవులకు యెగుమతి చేశారు."

యువజనులయెడ ప్రభుత్వ శ్రద్ధ

తమ త్యాగాలద్వారా, దేశసేవద్వారా ఇండోనేషియా యువజనులు ప్రజలయొక్క, ప్రభుత్వంయొక్క గౌరవ మన్ననలకు పాత్రులయ్యారు. ప్రభుత్వములో కూడ అర్హస్థానాన్ని

(మిగతా 9 వ పేజీలో)

అవీ - ఇవీ

మద్రాసు ప్రభుత్వము 1947 జులై నుండి గుంటూరులో నూతనంగా పశువైద్య కళాశాలను ఒకదానిని ప్రారంభింప నెంచెనని తెలుస్తూంది. ఈ కళాశాలలో ప్రధమ సంవత్సరం 40 మంది విద్యార్థులను జేర్చుకొంటారని, ఈ కళాశాలను ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు అనుబంధించుతారని (affliation) తెలుస్తూంది.

ఆంధ్రదేశం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడే దేశమయినా, నేటివరకు పశువైద్య కళాశాలే లేదు. రాష్ట్ర మంతటికీ మద్రాసులో ఒక్క కళాశాలే వుంటూ వచ్చింది. రెండవ కళాశాలను ప్రారంభించుటకు మద్రాసు ప్రభుత్వం తీసికొనిన నిర్ణయమును అభినందించుచున్నాము. గుంటూరు వైద్యకళాశాల వలెకాక ఈ కళాశాలకయినా విద్యార్థులకు అవసరములైన వసతి విద్యాసౌకర్యాములను ప్రభుత్వం వెంటనే కలుగజేయునని ఆశించుతాం.

విద్యాలయాలు విద్యార్థులకు ఆకర్షణీయంగా ఉండాలి

మద్రాసు విద్యాశాఖమంత్రి అవినాశలింగం చెట్టియార్ గారు మే 14 న మద్రాసులో జరిగిన ప్రాథమకోపాధ్యాయుల వేసవిక్లాసులను ప్రారంభించుచూ యిట్లు ఉపన్యసించారు : "విద్యాలయాలు, విద్యార్థులలో విద్యాభిలాష కలిగించుటకు ఆకర్షణీయంగా ఉండాలి. 5 గంటలు వరుసగా బాలురను స్కూలులో కూర్చుండ బెట్టుటరాక్షసత్వం. ఈపద్ధతిని నిర్మూలించాలి.

వెనుక విద్యాశాఖా మంత్రి ఆంధ్రదేశంలో విద్యాలయాలు సందర్శించినప్పుడు విద్యార్థులు విద్యాలయాలలోని స్థితిగతులను బాగుపర్చమని విన్నవించారు. కాని విద్యాశాఖామంత్రి జవాబుగా చెట్లక్రిందకూర్చొని చదువుకొనమని అప్పుడే సరియైన విద్యను పొందగలరని చెప్పారు. మద్రాసు సెక్రటేరియట్‌లో సర్వవసతులతో తులతూగు మంత్రులు, విద్యాభివృద్ధికి విద్యార్థులడిగిన కనీసకోర్కెలకు యిట్లు జవాబిచ్చుట విద్యార్థులను ఆశ్చర్యపరచింది. నేటికయినా విద్యామంత్రి పైదృక్పధమును వదలి విద్యాలయాలు ఆకర్షణీయంగా విద్యాభ్యాసమునకు తగియుండవలయునని గుర్తించుట సంతోషింపదగిన విషయం. విద్యామంత్రి యీ దృక్పధంతో నేటి విద్యాలయాలలోని పరిస్థితులను తెలుసుకొనుటకు తీవ్రప్రయత్నాలుజేసి — విద్యార్థుల విద్యాభివృద్ధికి అనువగు వసతులు కల్పించుటకు కృషి సల్పుతారని ఆశించుతాం.

గుంటూరు, మధుర వైద్యకళాశాలల భావి

గుంటూరు. మధుర వైద్యకళాశాలలకు నిర్మింపబడవలసిన భవనములనుగూర్చి, అవసరమైన పరికరముల విషయం; స్టెన్లీమెడికలు కళాశాల, విశాఖపట్నం వైద్య కళాశాల అభివృద్ధినిగూర్చి చర్చించుటకు మద్రాసు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు వైద్యకళాశాలల ప్రిన్సుపాళ్ళు, వైద్యశాఖామంత్రి, సర్జన్ జనరల్ సెక్రటేరియట్ భవనంలో మే 9 న సమావేశమయ్యారు.

మధుర, గుంటూరు కళాశాలల భావినిగూర్చి చర్చించి, ఈ కళాశాలల భవిష్యత్తునుగూర్చి ఎట్టినిర్ణయమునూ తీసుకొననట్లుతెలియుచున్నది. పరికరములు, భవనములు లేవనే సాకుతో మధురకళాశాల విద్యార్థులను మద్రాసుకు, గుంటూరు కళాశాల విద్యార్థులను విశాఖపట్టణమునకు మార్చవలసినదిగా సర్జను జనరల్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు పట్టుబట్టినట్లు తెలియుచున్నది.

ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు సర్. సి. ఆర్. రెడ్డిగారు గుంటూరు వైద్యకళాశాల నిర్మాణమునకే వ్యతిరేకులని 'నవయుగ' పాఠకులకు విదితమే. ఆంధ్రుల వైద్య విద్యపై దెబ్బగొట్టు యీ సలహాను ప్రభుత్వం అనుసరించకుండునట్లు క్రొత్తగా యేర్పరచిన వైద్య కళాశాలలకు అనువైన పరికరాలు ప్రభుత్వం వెంటనే సమకూర్చునట్లు ఆంధ్ర విద్యార్థులు, ప్రజలు ఆందోళన జేస్తారని ఆశించుతాం.

ఉన్నతవిద్య - ప్రభుత్వపోషణ

మద్రాసు ఎసెంబ్లీ ప్రశ్నా సమయంలో విద్యాశాఖా మంత్రి యీ క్రింది వివరాలను బయటపెట్టారు :

1945 - 46 సం॥లో మొత్తం ఉన్నత విద్యపై వివిధవర్గాలు 1,23,10,355 రూపాయలు. ఇందులో ప్రభుత్వం రూ. 45,81,822; స్థానికసంస్థలు రూ. 29,567; ప్రయివేటు కమిటీలు రూ. 28,65,012 ఖర్చుపెట్టారు.

48,33,954 రూ. విద్యార్థులనుండివసూలు జేశారు. అనగా ఉన్నతవిద్యపైఅయ్యేఖర్చులో సుమారునూటికి 40 చొ. న విద్యార్థులనుండి వసూలుచేస్తున్నారు.

విద్యాలయాలపైన-విద్యార్థుల ఆర్టుకళాశాలలపై రూ. 47,66,593 విద్యార్థినులకు ప్రత్యేకింపబడిన ఆర్టుకళాశాలలపైన రూ 5,24,055 పురుషులకు నిర్ణయించబడిన వృత్తి విద్యాకళాశాలలపైనరు. 28,97,225 స్త్రీలవృత్తి విద్యాకళాశాలలపై రూ. 3,35,484 మొత్తం ఖర్చుపెట్టుట జరిగింది.

1945—46 సం॥లో మనరాష్ట్రంలోని కళాశాలలన్నింటిలోని విద్యార్థులసంఖ్య 30 వేలకు మించిలేదు. అనగా ప్రతివిద్యార్థి ఉన్నత విద్యపై దామాషాన 41-42 రూ. లు ఖర్చుపెట్టుచున్నారు. ఇందులో 15 రూ. పై బడి విద్యార్థే చెల్లించుతున్నాడు. కాని యూరపియన్ దేశాల్లో విశ్వవిద్యాలయ విద్యకు ప్రభుత్వమే మనరాష్ట్రంలో ఖర్చుపెట్టు మొత్తమునకు 6 రెట్లు ఖర్చుబెట్టుతుంది. ఈ విషయం మనం విద్యా విషయాలలో ఎంత వెనుకబడియున్నదీ నిరూపించుతూంది.

కర్నూలుకు కళాశాల

నేటికికర్నూలువాసులకు కళాశాలఏర్పడటం ఎంతైనా సంతోషింపతగ్గవిషయము. కర్నూలు జిల్లాలో దాదాపు 16 హైస్కూళ్ళున్నాయి. ఈ హైస్కూళ్ళలో స్కూలుఫైనలు పరీక్షను పూర్తిచేసుకొన్న విద్యార్థులు కళాశాలల్ని వెదక్కుంటూ ఏ గుంటూరో, అనంతపురమో, మదనపల్లియో పోయి ఉన్నతవిద్యకోసం ప్రయత్నిస్తూండేవారు. ఈకాలానికి ఆ అగచాట్లన్నీ తప్పిపోయినాయి. కర్నూలుజిల్లాలోని విద్యార్థుల కింక కళాశాల విద్యఅందుబాటులో వుటుందని తెల్పుటకెంతైనా సంతోషిస్తున్నాం.

చాలాకాలంగా కళాశాల స్థాపనకోసం యీ జిల్లావాసులు ఆందోళన సాగిస్తూవచ్చారు. అలాంటిస్థితిలో కర్నూలుపట్టణంలోని ఒక ముస్లిం సంస్థవారు ప్రత్యేకంగా శ్రద్ధతీసుకొని కాలేజీకి ఏర్పాట్లుజేసి, అవసరమైన ధనాన్ని ప్రోగుజేసినారు. గతమాసంలో యూనివర్సిటీ తరపున పరిస్థితులు విచారించేందుకు గాను శ్రీ ఎ. లక్ష్మణస్వామి మొదలియార్ గారి యాజమాన్యాన కమిటీ వారిక్కడకువచ్చి విచారణచేసి కాలేజీకి అనుమతించారు.

"ఉస్మానియా కాలేజీ" అని పేరుపెట్టడం చేతముస్లింలకే ప్రవేశముటుందని భయపడనక్కరలేదు. మేనేజిమెంటు వారుఅన్నికులాల వారికి ప్రవేశ ముంటుందని తెల్పుతున్నారు. కాలేజీ జూన్ 30 నుండి ప్రారంభమవుతుంది.

ప్రస్తుతం కాలేజీలోఇంటర్మీడియేట్, బి.ఏ; బి. ఓ యల్. పరీక్షల జూనియర్ తరగతులు పెట్టుచున్నారు.

బెజవాడ తాలూకా యువజన మహాసభ

చిత్రలేఖనంలో 12 ఏండ్ల బాలునికి ప్రథమ బహుమతి

"నాటకములు సంఘాన్ని సంస్కరించి, ముందుకు తీసుకుపోవడానికి యేర్పడినవి. ఇవి మొదట శృంగార, వినోదములకు వినియోగపడినవి. రానురాను కాలపరిస్థితులను బట్టి, సాంఘికముగాను, రాజకీయముగాను ప్రదర్శింపబడుతున్నవి. ఇలాంటికృషి సాగించుతూయున్న యువజనసంఘములు అభివందనీయము"లని – నాటకరంగములోని తమ అనుభవములను వివరిస్తూ శ్రీ మాధవపెద్ది వెంకట్రామయ్యగారు, బెజవాడ తాలూకా యువజనసంఘ ద్వితీయ వైజ్ఞానిక మహాసభను ప్రారంభించారు. అధ్యక్షులు శ్రీ రాజారావుగారు మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి ప్రదర్శనాలపై, కేంద్ర, రాష్ట్ర ప్రజామంత్రి వర్గాలు నిషేధాలు విధించుట తగనిపని అనీ, అందుకు అందరూ ఆందోళన సాగించాలనీ చెప్పారు. నిషేధాలతో నిరుత్సాహం చెందక, ముందుకు సాగిపోతున్న యువజన వైజ్ఞానిక కృషిని కొనియాడారు. అనంతరం ఇతర గ్రామాలనుండివచ్చిన దళాలు 32 రకాల ప్రదర్శనాలను ప్రదర్శించాయి. ప్రథమ బహుమతి పెనమకూరు బాలసంఘానికి ద్వితీయ బహుమతి కోలవెన్ను యువజనసంఘానికి యివ్వబడెను. ఈ కార్యక్రమాన్ని 3 వేల మంది ప్రజలు ఎంతో ఆతురత, ఉత్సాహాలతో చూచారు.

పగలు చిత్రకళాపోటీలు శ్రీ మాదవపెద్ది గోఖలే సమక్షాన యేర్పాటుచేయబడ్డాయి. 4 గ్రామాలనుండి 17 చిత్రాలతో 7 గురు చిత్రకారులు ప్రదర్శనాలలో పాల్గొన్నారు. ప్రథమ బహుమానం సన్నాల ఆంజనేయులు 12 సం. విద్యార్థి వ్రాసిన గాంధీచిత్రానికి యివ్వబడింది. గానుగల రామలింగాచారిగారికికూడ ప్రథమ, యం. సుబ్బారావుగారికి ద్వితీయబహుమతులివ్వబడ్డాయి.

యువజన మహాసభ

తాలూకా ప్రతినిధుల సమావేశానికి 13 గ్రామాలనుండి 30 మంది ప్రతినిధులువచ్చారు. శ్రీ గూడవల్లి రామబ్రహ్మం, తలిశెట్టి రామారావుగారి మరణములకు, గాజుల్లంక పోరాటములో మరణించిన యువకులకు, వియ్యమ్మకు, జోహారులర్పించుతూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేసారు.

యువకుల కార్యకలాపాలు

వాలంటీర్ కోర్, ముందడుగు"లపై నిషేధాలు తొలగించాలనీ, ప్రజారక్షణ చట్టాన్ని రద్దుచేయాలని తీర్మానించారు.

నూతన సంవత్సరానికి శ్రీ పిడికిటి గోపాలకృష్ణయ్యగారిని అధ్యక్షులుగాను, శ్రీ కోడూరు వెంకటనారాయణగారిని కార్యదర్శిగాను, మరి 5 గురు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

రాత్రికి బహిరంగసభలో 2 వేలమంది ప్రజలఎదుట యువజన కార్యకలాపాలను వివరిస్తూ జిల్లాయువజన నాయకులు ఉపన్యసించారు.

ఒంగోలు తాలూకా 5 వ యువజన మహాసభ

యువజనులలో నూతన చైతన్యాన్ని రేకెత్తించింది

మే 24, 25 తేదీలు ఒంగోలుతాలూకా యువజనోద్యమచరిత్రలోమరపురాని రోజులు. టంగుటూరులో మహాసభ జరపటానికి నిర్ణయించుకున్నప్పుడు ఈకరువుకాటకాలరోజుల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొంటారాఅని సంశయం కలిగింది కాని ఉడుకురక్తం పొంగే యువకులు వీటిని లెక్కచేస్తారా? మహాసభ ఆవరణంలో అందంగా కోడి రామమూర్తిగేటు-డయాసు నిర్మించారు. ఆటల స్థలం ఏర్పరచారు. ప్రతినిధులకు భోజన సదుపాయాలు సమకూర్చారు, వీరి ఉత్సాహాన్ని పట్టుదలను అభినందిస్తూ గ్రామ కాంగ్రెస్ వాదులు రు. 200 లు విరాళాలుయిచ్చి తోడ్పడ్డారు. 24 తేది చెడుగుడు పోటీలు ప్రారంభమైనవి మంచి నైపుణ్యం ప్రదర్శించి ఆడిన 'ఒంగోలు - శివాజిటీము - టంగుటూరుజయప్రకాశటీము ఉప్పుగుండూరు భగత్సింగుటీము'ల ఆటలు చూచుటకు వందల కొలది స్త్రీ, పురుషులుహాజరై ఎంతోసంతోషించారు. పోటీ జేసిన 10 టీములలో 'శివాజిటీము' గెలుపొంది ఎండకప్పు బహుమానం పొందింది. 25 తేది మధ్యాహ్నం జరిగిన ప్రతినిధుల సభకు వివిధ ప్రాంతాలనుండి 70 మందియువకులువచ్చారు. నూతనకార్యవర్గ ఎన్నికల అనంతరం 'ప్రజారక్షణ చట్టాన్ని నిరసిస్తూ' ఉపాధ్యాయుల కోర్కెలను బలపరుస్తూ తీర్మానాలు చేశారు. సాయంకాలం ఉత్తేజకరమైన నినాదాలతో పెద్ద ఊరేగింపు జరిగింది. రాత్రికిమహాసభ. 9 గం. కల్లా మహాసభ ఆవరణ 6 వేలకుపైగావచ్చిన ప్రజలతో కళకళలాడింది. పరిసరగ్రామాల నుండి ప్రజలునినాదాలు యిచ్చుకుంటూ సభావరణచేరుకొన్నారు. 7 మైళ్ళదూరాన వున్న పొందూరునుండి కాలినడకను మధ్యగ్రామాల్లో ప్రచారం చేసుకొంటూ వచ్చారు. మహాసభకు కాసరనేని కోటేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. యంపరాల నాగేశ్వరరావుగారు జెండాప్రతిష్టాపన చేశారు.

శ్రీమతి మోటూరు ఉదయం సభను ప్రారంభిస్తూ దేశాభ్యుదయానికి మహిళల కర్తవ్యాన్ని ప్రబోధించారు. అధ్యక్షులు తమ ఉపన్యాసంలో స్వతంత్ర పోరాటాల్లో ప్రపంచ యువకుల వీరోచితపాత్రను వివరించి, భారత ప్రజల స్వేచ్ఛాభ్యుదయాలకోసం ఈ పతాకం నీడన యువకులందరూ ఐక్యతతో తమ మహత్తర కర్తవ్యాన్ని నెరవేర్చాలన్నారు. తర్వాత ఉప్పుగుండూరు ప్రజానాట్యమండలి యువకులు, బాలసంఘ సభ్యులు "విప్లవ విజయం" అనే నాటకం, నృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. 'ఇలాంటి మహాసభ ఇక్కడ ఎన్నడూ చూడలేదు- ఈ యువకుల పట్టుదల ఉత్సాహంచూస్తే ఆశ్చర్యం వేస్తుంది' అనుకుంటూ ప్రజలు వెళ్ళిపోయారు.

— మా విలేఖరి

(7వ పేజీ తరువాయి)

సంపాదించుకున్నారు. ప్రభుత్వ శాఖల్లో యువజన సమస్యలను చూడడానికై ప్రత్యేక శాఖ ఒకటుంది. బ్రాడ్కాస్టింగ్, సినిమా, వార్తా పత్రిక శాఖలలో ముఖ్యమైన బాధ్యతలన్నీ యువజనులే నిర్వహిస్తున్నారు. ఇండోనేషియా సోషలిస్టు యువజన సమితి ఉపాధ్యక్షుడు ఇండోనేషియా ప్రభుత్వంలో రాజ్యాంగ వ్యవహారాల శాఖామంత్రి. ఈయన వయస్సు 33 సంవత్సరాలు. యువజనసమస్యల శాఖను కూడ యీయనే చూస్తుంటారు. ఈ యువజన మంత్రి క్రింద పనిచేసే కార్యదర్శులు, తదితరులుకూడ యువజనులే. (దిస్టూడెంట్ నుండి)

అనుసరణ: అన్నే కోటేశ్వరరావు

మౌంటుబాటన ప్రణాళిక

అంతర్యుద్ధాన్ని ★ కొనిపోవడమే




మౌంటుబాటన్

యుద్ధానంతరంభారత ప్రజలుస్వాతంత్ర్యము కొరకు అనేక బ్రహ్మాండమైన పోరాటాలు సడిపారు. సామ్రాజ్యవాదుల నిర్బంధవిధానం యీ ప్రజాపోరాటములను అణచలేక పోయింది సామ్రాజ్యవాదానికి మూలస్థంభాలయిన స్వదేశ సంస్థానా ధీశులను యీప్రజా వెల్లువ గడగడ లాడించింది. ప్రభుత్వం ప్రజాఉద్యమాల నణచ టానికని నిర్మించిన సైన్యంలో గూడ సామ్రాజ్య వాదం యొక్క శక్తిపై విశ్వాసం పోయింది. ప్రతివర్గం భారతీయులకు అధికారం అప్పగించా లని, నూతనజీవిత ప్లానులు కావాలనీ వాంఛిస్తు న్నారు. సామ్రాజ్యవాదులుభారతప్రజలలోని ఈ చైతన్యమును గుర్తించారు చరిత్రలోసాటిలేని నిర్బంధవిధానంఅమలుపర్చినా, నేటిప్రవుద్యమా లను అణచలేకపోవుట కళ్ళారాజూచారు భారత దేశంపై తమపెత్తనం సాగించు కొనుటకుపాత పద్ధతులు పనికిరావని తెలుసుకొన్నారు. రోజు రోజుకూ విజృంభించుచున్న ప్రజాచైతన్యాన్ని చూచి బెదరి 1948 జూన్‌నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యమిస్తామని ప్రకటించక తప్పలేదు. సంవత్సరములనుండి ఇండియానుండి తెల్ల వాండ్లు వెళ్ళిపోవుటకు తారీఖు నిర్ణయించమని జాతీయోద్యమం కోరుతూవచ్చింది. కాని సామ్రాజ్య వాదులు అట్లుచేయ నిరాకరించుతూ వచ్చారు. కాని, నేడు పరిస్థితులు తారుమార య్యాయి. సామ్రాజ్య వాదులు జాతీయోద్యమ ప్రభావం ముందు తలవంచక తప్పలేదు 1948 జూన్ ఇండియానుండి సామ్రాజ్యవాదులువెడలి పోయేరోజుగా నిర్ణయించ గల్గటం జాతీయోద్య మానికి గొప్పవిజయం.

సామ్రాజ్యవాద కుట్రలు

200 సం. పరిపాలనతర్వాత సామ్రాజ్య వాద ప్రకటనలను నమ్మిన భారతీయుడెవరు? 1948 జూన్‌కు భారతదేశంనుండి వెడలి పోతామని ప్రకటించినా సామ్రాజ్యవాదులు తమకుట్రలు సాగించుతునే యున్నారు. సంస్థా నాలు భారత యూనియన్‌లో భాగంగాదని 'స్వతంత్రుల'ని ప్రకటించారు. సంస్థానాలను తమ భవిష్యత్ కేంద్రములుగా నిర్మించుకొని భారతదేశంపై పెత్తనం సాగించుటకు ప్లానులు వేస్తూ వచ్చారు. ఇందుకువీలుగా నేడు సంస్థా నాలలో యుద్ధపరిస్థితులు కల్పిస్తున్నారు. రాష్ట్రముఃకయినా అధికారం హస్తగతం చేస్తా



పండిత నెహ్రూ

మని పంజాబులోను, సరిహద్దురాష్ట్రంలోను అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టారు. ఆర్థికంగా భారతదేశాన్ని తమ స్వప్రయోజనానికి అమ్మ సిద్ధపడిన కొద్దిమంది పెట్టుబడిదార్ల సహ కారంతో మన దేశ ఆర్థిక స్థితిగతులను తమ చెప్పుచేతల్లో వుంచుకొనుటకు కుట్రలు పన్ను తున్నారు. ఈ కుట్రల అంతిమస్థాయియే నేటి మౌంట్‌బాటను ప్రణాళిక.

విభజన ప్రణాళిక

1948 జూన్‌కు భారతీయులకు తామెలా అధికారం హస్తగతం చేయనున్నదీ వివ రించుతూ జూన్ 3 న వైస్రాయి మౌంట్ బాటన్ ఒక ప్రకటనచేశాడు. ఈ ప్రకటన ప్రకారం భారతదేశం రెండుగా విభజింపబడు తుంది. కాంగ్రెస్ పలుకుబడిక్రిందనున్న రాష్ట్రములను కలిపి హిందూస్థాన్‌గనూ; లీగు పలుకుబడిక్రిందనున్న ముస్లిం మెజారిటీ ప్రాంతాలను పాకిస్థాన్‌క్రిందనూ ఏర్పరుచ తారు. నేడున్న రాజ్యాంగసభలో ముస్లింలీగు అనుచరులు పాల్గొనుటలేదు కనుక ముస్లిం మెజారిటీ ప్రాంతాల రాజ్యంగమును నిర్మించ కొనుటకు వేరొక రాజ్యాంగసభను ఏర్పరచ తారు. నేటి రాజ్యాంగసభ హిందూస్థాన్ రాజ్యాంగమును తయారుచేస్తుంది. పంజాబు బెంగాలు రాష్ట్రములను హిందూమెజారిటీ ముస్లింమెజారిటీ భాగములక్రింద ఆయా రాష్ట్ర ముల అసెంబ్లీసభ్యుల అభిప్రాయములను తీసుకొని 1941 సం॥ జనాభా లెక్కల ననుస రించి జిల్లాలను ప్రమాణంగా తీసుకొని విభ జిస్తారు, భవిష్యత్‌లో విభజన వివరములను నిర్ణయించుటకు వైస్రాయి అధ్యక్షతన సరి హద్దునిర్ణయ కమిటీ నియమింపబడుతుంది సరిహద్దురాష్ట్రం హిందూస్థాన్‌తో చేరి యుంటుందా, లేక పాకిస్థానుతో చేరివుంటుందా అన్నసమస్యపై వైస్రాయి పెత్తనంక్రింద ప్రజాభిప్రాయం (రిఫరెండం) తీసుకోబడ తుంది. ఈ ప్రణాళికను అమలుపర్చుటకు యీసంవత్సరం లోపుగనే హిందూస్తాన్ పాకిస్తాన్‌లకు అధినివేశ ప్రతిపత్తిహోదా యివ్వబడుతుంది. ఈ ప్రకటన నేటి స్వదేశ సంస్థానాలకు వర్తించదు. స్వదేశసంస్థానాల వెనుక ప్రకటింపబడినట్లు 'స్వతంత్రం' అవ తాయి. ఏ రాజ్యాంగసభలో చేరాలో అన్న సమస్య వారే నిర్ణయించుకొనవచ్చు.

ప్రణాళికలోని దురుద్దేశాలు

నేటి యీ బ్రిటిష్ ప్రణాళిక దేశంలో శాంతిని ఏర్పరచలేదు. పైపెచ్చు విభజన ద్వారా సోదరప్రజల మధ్య అంతర్యుద్ధ

అంతిమస్థాయికి బ్రిటన్ ప్లాను

యస్. వి. నరసయ్య

సరింత తీవ్రమవుతుంది. నేటికే, వెనుక ప్రకటించిన బ్రిటిష్ ప్రణాళికలన్నీ కాంగ్రెసు - లీగుల విభేదాలను తీవ్రపర్చాయి చివరకు ఈ ప్రణాళికతో భారత దేశ విభజన సామ్రాజ్యవాదులు తమ స్వప్రయోజనాలకు ఏర్పరచినా. విభజన బాధ్యత మననెత్తిన రుద్దారు ఇక రేపు జరుగవలసిన సరిహద్దు నిర్ణయ విషయం చూస్తే సామ్రాజ్యవాదుల కుట్ర బోధపడుతుంది తుదిసారిగా సరిహద్దులను నిర్ణయించడానికి ఏ సిద్ధాంతమూ లేదు సరిహద్దు నిర్ణయంలో వచ్చిన తగాయిదాలకెల్ల బ్రిటిష్ వైస్రాయియే మధ్యవర్తి. నేటి కాంగ్రెస్ - లీగు విభేదాలను తమ కనుకూలంగా వుపయోగించుకొనుటకు ప్రయత్నిస్తార.

దేశాన్ని విభజనతో ఆర్థికంగా సామ్రాజ్యవాదులు దుర్బలపర్చుతున్నారు అభివృద్ధి చెందని వాయువ్యప్రాంతములోని సహజ సంపదలను కబళించివేయుటకు జూస్తున్నారు. ఇందుకు ముస్లింలీగులోని అభివృద్ధి నిరోధకుల బలమును, లీగు కండగానున్న జమీందారులను, నవాబులను ఉపయోగించుకొన జూస్తున్నారు ఇదేవిధంగా ప్రపంచాధిపత్యానికి, సోవియట్‌కు వ్యతిరేకంగా ఆంగ్లో - అమెరికను సామ్రాజ్యవాదులు నిర్ణయించుతున్న మిలటరీ ప్లానులకుగూడ యీ పాకిస్థానును కేంద్రంగా ఉపయోగించ కుట్రలు పన్నుతున్నారు.

నేటి ప్రణాళిక ప్రకారం దేశమును విభజించింది రెండుభాగముల క్రింద మాత్రమే కాదు. స్వదేశ సంస్థానాలకు "స్వతంత్ర" మిచ్చి శతవిభాగములక్రింద విభజించారు. ఈ సంస్థానాలను బ్రిటిష్ మిలటరీ కేంద్రాల క్రింద వుంచుటకు చూస్తున్నారు.

ఇది స్వతంత్ర ప్రణాళిక కాదు.

వెనుక భారతదేశమును 1948 జూన్‌లో వదలిపోతామని ప్రధాని అట్లీ పార్లమెంటులో ప్రకటించగనే కరుడుగట్టిన కన్సర్వేటివ్ చర్చిల్, లేబరుప్రభుత్వం సామ్రాజ్యాన్నివిచ్చినం జేస్తున్నారని పెడబొబ్బలు పెట్టాడు. కాని యీసామ్రాజ్య వాదే నేటి మౌంటుబాటెన్ ప్రణాళికను ఆశీర్వదించాడు. భారతజాతియోద్యమాన్ని విచ్ఛిన్నపర్చి, దేశంలో అనేక ఆర్థిక, సైనిక కేంద్రాలను నిర్మించుకొనుటకు యీ ప్రణాళిక సామ్రాజ్యవాదులకు వీలిస్తుంది అంతేకాక భారతదేశం నిజమైన స్వాతంత్ర్యసిద్ధికి పురోగమించకుండా అనేక అడ్డంకులను కల్పిస్తుంది.

జాతీయోద్యమ బాధ్యత.

మౌంటుబాటన్ ప్రణాళికను హృదయ భారంతో అంగీకరిస్తున్నాననిపండిట్ నెహ్రూ ప్రకటించాడు. తమకంగీకారం కాకపోయినా వేరు గత్యంతరంలేక దేశవిభజనను అంగీకరిస్తున్నామని ప్రకటించారు నేటిజాతీయోద్యమం యొక్క ముఖ్యకర్తవ్యం నేటి ప్లానులోని సామ్రాజ్యవాదుల కుట్రలను భగ్నపర్చుట



జనాబ్ జిన్నా

నేడుసామ్రాజ్యవాదులకువున్నబలం దేశంలో చెలరేగుతున్న అంతర్యుద్ధం. దీనిని అపుటకు కాంగ్రెస్ రాష్ట్రముల పునర్విభజన జరిపి, రాష్ట్రాలకు స్వయంనిర్ణయ హక్కు నివ్వాలి.



ప్రధాని అట్లీ

వెనుకబడిన ప్రాంతముల ఆర్థికవ్యవస్థను అ వృద్ధిపర్చుట, జమీందారీలను రద్దుచేయుట పరిశ్రమలను జాతీయంజేయుట ముంద అనుసరించ వలసిన కర్తవ్యం. ఈకర్తవ నిర్వహణద్వారానే విభజనవాదుల కూకటివే త్రెంచుటకు, సామ్రాజ్యవాదుల ప్లానుల బలపర్చు అభివృద్ధినిరోధకులకు చావుదెబ గొట్టుటకు వీలవుతుంది

నేడు ప్రతిస్వదేశసంస్థానములోను బాధ తాయుత ప్రభుత్వములకొరకు ప్రజలు పోరా తున్నారు. కాంగ్రెస్ యిట్టిపోరాటములనె బలపర్చాలి ప్రతిసంస్థానం తన ప్రతినిధుల రాజ్యాంగ నిర్ణయ సభలోనికి పంపునట్లు ప్ర లకు సర్వపౌరసత్వ హక్కు-లంగీకరించున వత్తిడిచేయాలి అప్పుడు నేటి స్వదేశసంస్థా ధీశులు దిగిరాగలరు. సంస్థానాలను త మిలటరీ కేంద్రాలు చేసుకొనవలయునన సామ్రాజ్యవాదుల ప్లానులను ఓడించగలం.

పై కార్యక్రమమును నేడు మన జా యోద్యమం అనుసరించుటద్వారానే సామ్రా వాద ప్రణాళిక పెట్టిన అంతర్యుద్ధచిచ్చు ఆర్పివేయగలం స్వదేశసంస్థానాలనురద్దుచే గలం. కాంగ్రెస్-లీగుల సామరస్యాని కవస మైన ప్రజాఐక్యతను నిర్మించగలం. అభివృ నిరోధకులను నిస్సహాయస్థితిలో పడత్రో గలం ఈకార్యక్రమమే నేటి మౌంట్‌బాటె కుట్రలను చిన్నాభిన్నం చేస్తుంది, యువకుల భారత స్వాతంత్ర్య ఉద్యమాభివృద్ధికి పైకా క్రమాన్ని జాతీయోద్యమం అవలంబించున కృషిచేయవలసియుంది.

ఉపాధ్యాయుల కోర్కెలు
విద్యార్థుల జీతాల పెంపుదల

మల్లవరపు రామకృష్ణారావు

జూన్ నెల చివరివారం సమీపిస్తూంది. మద్రాసురాజధానిలోని ప్రాథమికోపాధ్యాయులందరూ జూన్ 25 నుండి, సెకండరీస్కూళ్లలోని ఉపాధ్యాయులు జులై 1 నుండి తమ కోర్కెలను ప్రభుత్వం అంగీకరింపకున్న సమ్మె ప్రారంభించాలని నిర్ణయించారు అనేకచోట్ల సమ్మె బ్యాలెటులు తీసుకొనబడినవి. సమ్మెకు అనుకూలంగా నూటికి 90 నుండి 95 వరకు ప్రతిచోటా ఓటు చేశారు. ఉపాధ్యాయులలోని దీక్షను యిది తెలియపరుస్తుంది దక్షిణ భారత ఉపాధ్యాయుల సంఘ (S I T.U.) నాయకత్వం చాల మితవాద నాయకత్వం. సంవత్సరములనుండి సమ్మెలకు వ్యతిరేకం. వెంకటగిరి మొదలైనచోట్ల హైస్కూలు ఉపాధ్యాయులు స్థానికనిరంకుశత్వమునకు వ్యతిరేకంగా సమ్మెజేస్తే, సమ్మె మానకున్న శిక్షణచర్య తీసుకొంటామని బెదరించి సమ్మెనుమాన్పించారు. మద్రాసుసభలో గూడ యీ మితవాదనాయకత్వం సమ్మెను వ్యతిరేకించినా, ఉపాధ్యాయులు నాయకత్వ పంథాను వ్యతిరేకించారు ఇట్లేదేశంమొత్తంగా ఉపాధ్యాయులలోని యీనూతన సంచలనాన్ని సర్దార్ పటేల్‌తీవ్రంగా విమర్శించడం జరిగింది. కార్మికులవలె సమ్మెలుజేయుట ఉపాధ్యాయ వృత్తిగౌరవమునకు తగదని పెద్దలు ఎందరోహెచ్చరించారు కాని కాలేపొట్టలతో బాధపడేఉపాధ్యాయులనుయీబోధలు సంతృప్తిపరచలేదు. నేటిసమస్యలే ఉపాధ్యాయులను కార్యాచరణకు నెట్టుతున్నాయి ఇదీ నేడు మనం గుర్తించవలసిన విషయం.

ప్రభుత్వ వైఖరి

రాష్ట్రంలో ఏ వ్యక్తి, ఏ సంస్థ ఉపాధ్యాయుల కోర్కెలు గొంతెమ్మ కోర్కెలని అనలేకపోయారు ప్రతి ఒక్కరూ ఈ కోర్కెలలోని న్యాయాన్ని అంగీకరించారు. చివరకు విద్యాశాఖామంత్రిగూడ ఉపాధ్యాయుల జీతాలు పెంచాలని అంగీకరించారు కాని ప్రభుత్వం యీ వాగ్దానముల నమలుపర్చుట లేదు అందుచే ఉపాధ్యాయులు సమ్మెలకు దిగవలసివస్తూంది.

ప్రభుత్వ వైఖరి మారకున్న మన విద్యావిధానం దెబ్బతినకమానదు. నేడు ప్రతిచోటా ఉపాధ్యాయులకొరత యుంది తిండికి చాలని జీతాలతో ఉద్యోగాలు ఎలాచేయగల్గుతారు? మంత్రివర్గం విద్యావ్యాప్తికి ప్లానులువేస్తూంది కాని సరియైన జీతాలు యివ్వనిది ఈ ప్లానుల అమలుపర్చు ఉపాధ్యాయులు ఏరీ? తమ ప్లానుల అమలుపర్చుటకు విద్యావిధానాభివృద్ధికి మంత్రివర్గం నేటి దృక్పథమును మార్చుకొనుట అవసరం

మార్గానపోతూంది. నేటి ఉపాధ్యా లకోర్కెలను ప్రజలు, విద్యార్థులు బలపర్చుతున్నారు. ఈ ప్రజాబలంవలన ఉపాధ్యాయుల కోర్కెలను వెనుకవలె తిరస్కరించుట యికముందు సాధ్యంకాదు కనుక తమ పంథాను అమలు జరుపుటకు ప్రజల—ఉపాధ్యాయుల మధ్య, ఉపాధ్యాయుల—విద్యార్థులమధ్య చీలికలు అవసరమని ప్రభుత్వం గుర్తించింది

విద్యార్థుల జీతాలపెంపుదల

ఈచీలికలు కల్గించుటకే ఉపాధ్యాయుల జీతాలు పెంచుట అవసరమని 9, 10 నెలల జీతాలను వసూలుచేయమని మునిసిపల్, బోర్డు స్కూళ్ళకు ప్రభుత్వం ఆజ్ఞాపించింది రైతులపై పన్ను హెచ్చించుటకు అంగీకరించునట్లు ప్రచారం చేయమని ఉపాధ్యాయులను మంత్రి మాధవమీనన్ కోరారు ఈ సలహాలు ఉపాధ్యాయుల బాగునుకోరికాక నేటి ఉద్యమ ఐక్యతను విచ్ఛిన్నం చేయుటకు మాత్రమేనని ఈ క్రింది విషయాలు రుజువుపర్చుతాయి.

(మిగతా 15 వ పేజీలో)



సర్దార్ పటేల్ ఉపాధ్యాయులను సమ్మెచేయవద్దని హెచ్చరిస్తున్నా, ఐక్యతతో తమహక్కులను సాధించ

ఆహార సంక్షోభం యువకుల కర్తవ్యం ★

వేములపల్లి వెంకటదాసు

నేడు యెటువిన్నా ఆహారకరువునుగూర్చిన వార్తలే. గుంటూరుజిల్లా కాంగ్రెసుకార్యవర్గ సమావేశం గుంటూరుజిల్లాను కరువుప్రాంతముగా ప్రకటించమని ప్రభుత్వాన్ని కోరింది. తాత్కాలిక ప్రభుత్వ ఆహారశాఖ సభ్యుడు శ్రీ రాజేంద్రబాబు రేడియోలో ఉపన్యసిస్తూ, మద్రాసు ప్రభుత్వం అంచనాప్రకారం వచ్చే అక్టోబరునాటికి 14 లక్షల టన్నుల బియ్యం సేకరించలేకపోతే 10 ఔన్సుల రేషన్ కూడ కార్డులు ఉన్నవారికి సాధ్యంకాద"ని ప్రకటించారు మార్చి ఆఖరుకు 5,99 500 టన్నులు ధాన్యం సేకరించా లనుకుంటే 2,56,640 టన్నులధాన్యంమాత్రమే సేకరించ గల్గామని మద్రాసు ప్రభుత్వం ప్రకటించింది.

సామ్రాజ్యవాద దోపిడీ ఫలితం

నేడు మన ప్రజల నెదుర్కొనుచున్న అహార కరువుయొక్క తీవ్రతపై ప్రకటనలు స్పష్టపర్చుతాయి సస్యశ్యామలమైన భారత భూమిలో ప్రతి సంవత్సరం యీ కరువు సమస్య మనల నెందుకు ఎదుర్కొంటుంది?

200 సంవత్సరముల సామ్రాజ్యవాద పరిపాలన మన ఆర్థికవిధానాన్ని తారుమారు చేసింది. మన వ్యవసాయాన్ని పురాతన పద్ధతిలోనే ఉంచింది. భారతదేశము వ్యవసాయకదేశమైనా, మన రైతుకు భూమిపై హక్కు లేకపోవుటచేత జమీందార్ల దోపిడీచేత, కష్టించి పండించినదానికి ఫలితం రైతు పొందలేకపోతున్నాడు. రైతుకష్టం భూస్వాములు, జమీందారులు దోచుకుంటున్నారు, అందుచేత మన వ్యవసాయము రోజురోజుకు క్షీణించుతోంది అందుచే "ప్రపంచంలో అభివృద్ధి అయిన దేశాలు ఎకరానికి పండించే పంటలో మూడవ వంతుకూడా భారతదేశంలో పండుటలేదు." "భారతదేశములో భూములకు సరియైన ఎరువులు లేకపోవుటచేత, సరియైన వ్యవసాయ పద్ధతు లవలంబించకపోవుటచేత 1913 సం॥ తర్వాత నూటికి 25 చొప్పున ఎకరానికి పండే పంటవిలువ తగ్గింది."

ఇదీ మనకు సామ్రాజ్యవాదుల పరిపాలన యిచ్చిన ఫలితం. దీనినుండి ప్రతిసంవత్సరం భారతదేశంలో ఏదో ఒకభాగంలో కరువు విలయతాండవం జేస్తూనేయుంది. వేలకొలది ప్రాణాలను బలిగొంటుంది.

కరువు తీవ్రత


సక్రమ వ్యవసాయ పద్ధతులను అనుసరించితే భారతదేశం పొరుగుదేశాలకు ఆహారం సప్లయి చేయగలదు, కాని సామ్రాజ్యవాద పరిపాలనా ఫలితంగా నేడు ప్రతి సంవత్సరం యితర దేశాలనుండి ఆహారం దిగుమతి చేసుకోవలసివస్తూంది ఈ సంవత్సరం భారత ప్రజలకు తిండిపెట్టుటకు 40 లక్షల టన్నుల ధాన్యం దిగుమతి జేసుకోవలసి యున్నది. దీనికితోడుగా మన ఆంధ్ర జిల్లాలలో యీ సంవత్సరం అతివృష్టితోను, అనావృష్టితోను పంటలు దెబ్బతిన్నాయి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి బ్లాకుమార్కెట్టులో బియ్యం ధర 100 నుండి 126 రూ వరకు అమ్ము

ప్రాంతాలలో సైతం బియ్యం బస్తాకి 40 - 50 రూ. అమ్ముతున్నాయి. ఈ ఆహార సంక్షోభం ఆంధ్రజిల్లాలలో - అనంతపూరు, కర్నూలు, కడప, చిత్తూరు కొన్ని తాలూకాలు, గుంటూరు మెట్టతాలూకాలు-విశాఖజిల్లాలలోనూ వ్యాపించియుంది. ఆంధ్రదేశం మొత్తంలో షుమారు కోటి ప్రజలు నివశించుభాగం నేటి ఈ ఆహార సంక్షోభమునకు గురియైయుంది.

ప్రభుత్వ పంధా

రాష్ట్రంలో మిల్లుయజమానులు, జమీందారులు, బ్లాకుమార్కెటు వర్తకులు, లంచగొండిఉద్యోగులు నేటితిహారకరువును తమబొక్కసాలు నింపుకొనుటకు ఉపయోగించు కొంటున్నారు. ప్రభుత్వం నేటిఆహార సమస్యాపరిష్కారమునకు ప్రజలసహాయ సానుభూతులపైగాక యీ బ్లాకుమార్కెటుదార్ల, మిల్లుయజమానులపై ఆధారపడింది అందుచే బ్లాకుమార్కెటునిర్మూలనకు ప్రభుత్వం గట్టిచర్యలు తీసుకొనలేకపోతున్నది. చల్లపల్లి జమీందారు కంట్రోలుధరకు మించిబస్తా 14-6-0 చొప్పున వేలంపెట్టివేల బస్తాలధాన్యం అమ్మితేప్రభుత్వం ఏమిచేసింది? అప్లేజిల్లాలలో అనేకచోట్ల ప్రొక్యూరుమెంటు కని నియమింపబడిన మిల్లుయజమానులే, బ్లాకుమార్కెటుధరలకు ధాన్యమునుకొని నిల్వజేస్తున్నారు పైగా యీనిల్వవ్యాపారస్తులురైతు ధాన్యం అమ్ముటలేదని రైతాంగముపై నింద

(మిగతా 22 వ పేజీలో)



గ్రామాల్లో తినటానికి తిండిలేక స్వగ్రామాలను వదలి తర్లిపోతున్న దృశ్యం
(అమ్మనబ్రోలు "యువజన" వ్రాతపత్రికనుండి)

బాలబాలికలకు

బాలవీరుడు



ఈ నెల సంచికలో మీకు చక్కని కథ చెపుతా "నవయుగ" రెండవసంచికలో వీట్నాం దేశ బాలవీరుల కథలు విన్నారుగదూ! ఈ సంచికకు మన దేశంలోని ఒక బాలవీరునికథ మీకు చెబుతా. ఇది నిజంగా జరిగిన కథ దీనిని బందరునుండి శ్రీ పినపాల వెంకటేశ్వరరావుగారు మీకోసం వ్రాసిపంపారు.

ప్రతిరోజూ మీనుండి వార్తలు వస్తాయని ఎదురుచూస్తున్నా ఒక్క ఉత్తరంకూడ మీ నుంచి వచ్చుటలేదు మీ కథలూ, పాటలూ "నవయుగ" లోనివి ఎట్లా ఉంటున్నదీ మీ అక్కకు వ్రాయరూ? వస్తా! జవాబు వ్రాయుట మరచిపోవద్దు.

మీ అక్కయ్య

★

మనప్రక్కరాష్ట్రమైన ఒరిస్సాలో డెంఖనాల్ అనే స్వదేశసంస్థానం ఉంది సంస్థానాన్ని పాలించే రాజులు సాధారణంగా చాల చెడ్డవాళ్ళు. డబ్బు వుందని మదం ఎక్కువ ఎప్పుడూ తాగి తందనాలాడుతుంటారు వీళ్ళకు డబ్బు ఎక్కడనుంచి వస్తుంది ? పేదవాళ్ళ మీద పన్నులువేసి డబ్బు లాగుతుంటారు. పన్నులు ఇవ్వలేకపోతే వాళ్ళని నానాహింసలు పెట్టి పీడించుకు తింటారు "ఇది అన్యాయం" అని చెప్పుకుంటే ప్రజల్ని లాఠీకర్రలతో కొట్టిస్తారు తుపాకుల్తో కాల్పించి చంపిస్తారు.

ఢెంఖనాల్ సంస్థానంకూడ అటువంటి సంస్థానాల్లో ఒకటి రాజుగారి యీ అన్యాయాన్ని ఎదిరించడం కోసం అక్కడి ప్రజలంతా కలసి "ప్రజామండలి" అనే సంఘాన్ని పెట్టుకున్నారు. "ప్రజామండలి" అంటే చిన్నవాళ్ళకీ, పెద్దవాళ్ళకీ-అందరికీ ప్రేమ యెక్కువైంది, ఎందుచేతనంటే, అది వారిహక్కులకొఱకు పోట్లాడుతోంది గనుక "ప్రజామండలి"బలంచూచి రాజుకన్నుకుట్టింది ఎట్లాగైనా దాన్ని నాశనం చేయాలనుకున్నాడు "ప్రజామండలి" నాయకుల్ని జైళ్ళలో పెట్టినాడు దానిలో సభ్యులుగా చేరినవారిని లాఠీకర్రలతో కొట్టించి, తుపాకులతోకాల్పించి చంపించాడు కాని ప్రజలు ఎవ్వరూ జంకలేదు. పోలీసువాళ్ళ రాజ్యం చేస్తున్నారు. విచ్చలవిడిగా తిరుగుతున్నారు. కాని "ప్రజామండలి"ని అణగ్గొట్టలేక పోతున్నారు.

మనకథ జరిగిననాటి రాత్రి గాలివాన వచ్చింది. ఆకాశంలో మబ్బులుబాగా అలుముకున్నాయి. లోకం అంతా చీకటిగా వుంది. కళ్ళు కనిపించడంలేదు పెనుగాలికి చెట్లు విరిగి ఫెళా ఫెళా మంటూ క్రిందపడుతున్నాయి. నేల అదిరేటట్లు ఉరుములు ఉరుముతున్నాయి. పిడుగులు పడుతూ వున్నాయి. అటువంటి రాత్రిపూట కొందరు పోలీసులు తుపాకులతో నదిని దాటటానికి నదిఒడ్డుకు వచ్చారు చీకట్లో పడవలు కనిపించలేదు. నడిపేమనుష్యులూ కనిపించలేదు, చూడగా చూడగా ఒక పడవ కనిపించింది; కాని నడిపేమనిషి కనిపించలేదు. "పడవ నడిపేవాళ్ళెవరోహో " అంటూ పెద్దగొంతుకల్తో అరిచారు. ఫెళ ఫెళా ఉరిమిన ఉరుములు తప్ప బదులులేదు, ఇంతలో మినుకు మినుకు మంటూ ఒకవెలుగు కనిపించింది. పోలీసులా వెలుగుదగ్గరకు నడచి వెళ్ళారు. ఒక చిన్న పూరిగుడిసెలో దీపం మిణుకు మిణుకు మంటున్నది. గుడిసెలో చిన్నపిల్లవాడొకడు నిద్రపోతున్నాడు. లేవకొట్టారు. కళ్ళునలుపుకుంటూ లేచి నిలుచున్నాడు. ఈ పిల్లవానిపేరు రౌత్. పడవల్నినడిపేవృత్తి 12 సంవత్సరాల వయస్సుంటుంది. "ప్రజామండలి" వారు తమ మనుష్యుల్ని నదిని దాటించడానికీపిల్లవాడ్ని నియమించారు. సన్నగా, పుల్లలాగుంటాడు.

"పడవకడ్తావురా" అని పోలీసులు దబాయించి అడిగారు.

"ఎవరు మీరు" అని బాలుడు లెఖ్ఖచెయ్యనట్లుగా మాట్లాడాడు

"కళ్ళు పోయినైరా. కనిపించటంలే. పోలీసులం"అంటూ పొగరుబోతుతనంగా అన్నారు.

"ఈ పడవ ప్రజామండలిది, పోలీసులది కాదు" అన్నాడు బాలుడు.

"గాడిద కొడకా! యింత తలపొగరా?" అంటూ తుపాకీ మడమలతోటి పిల్లవాడి నెత్తిమీద కొట్టారు తుపాకుల చివరున్న కత్తులతో డొక్కలో పొడిచారు నెత్తురు వరదలై పారింది.

"నాయనో! చచ్చాను" అంటూ పిల్లవాడు నేలమీద కూలాడు.

"ఇప్పటికైనా పొగరణిగిందా?" అంటూ పోలీసులు గద్దించారు.

పిల్లవాడు తొక్కత్రొక్కిన త్రాచులాగ లేచి నిలబడి "నేను మీబెదరింపులకు భయపడేవాణ్ణికాను మీరు ప్రజలకు శత్రువులు. ద్రోహులు, ఇది మీరెక్కే పడవకాదు " అని ధైర్యంతో అన్నాడు

చూచారా ఆ బాలుని ధైర్యం? తానొక బాలుడు. ఒంటరిగాడు. కాని యెదిరించేది నలుగురి పోలీసుల్ని. పెద్దపెద్ద తుపాకులతోయమభటుల్లాగున్నారు ఆ బాలుని ధైర్యాన్ని, దేశభక్తినీ, పట్టుదలనూ మీ రలవర్చుకొంటారు గదూ!

బాలవీరుడు వీరస్వర్గం పొందాడు. రౌత్ మరణించినా డెంఖనాల్ ప్రజలతన్ని మరువలేదు. వారెప్పుడూ తలచుకుంటూనే వుంటారు. మీరుకూడ మీతలిదండ్రుల హక్కుల రక్షణకు రౌత్వలె పోరాడాలి ఆంధ్రబాల బాలికలు రౌత్ వంటివీరులని ఋజువుపర్చాలి. అల్లా చేస్తారుగదూ!

చెడుగుడు కూత

శ్రీ తెన్నేటి సూరి

చెడుగుడు, చెడుగుడు,
చెంగలిగుడుగుడు
భల్ చెడుగుడుగుడు
చెంగలి గుడుగుడు చె

దేశం దేశం, భారతదేశం,
భారతదేశం, వీరావేశం.
బాలకుమారుల క్రోధావేశం,
రెచ్చినకోపం, చిచ్చరపిడుగూ ! . చె.

విచ్చలవిడిగా వీరవిహారం
చీకటిచింతల చిక్కటరణ్యం,
మంటలు, మంటలు, మంటలు, మంటలు
'కణేలు'మన్నది కణాదుబొంగూ చె

తీరనికోపం వీరవిహారం,
జ్వాలాతోరణ కీలాభీలం,
మంటలురేగిన, మారణహోమం,
బెబ్బులికాలిన ప్రళయారావం ...చె.

కోళ్ళనుబట్టిన జంగురుబిల్లులు.
లేళ్ళను కరచిన తోడేళ్ళన్నీ.
లేగను చీరిన వాగునక్కలూ,
దుక్కిటెద్దులను మెక్కినబెబ్బులి
కణకణ కణకణ కాలండీ !
బ్రతుకదలిస్తే పారండీ !! చె.

దేశందేశం, భారతదేశం !
భారతదేశం వీరావేశం
బాలకుమారుల, క్రోధావేశం
రెచ్చినకోపం, చిచ్చరపిడుగూ చె.

చీకటివేరం, చిక్కలతీరం
రక్కసిరాజులు, మెక్కేటబళం
పరాయిరాజుల షరాయిజేబూ
దేశందేశం భారతదేశం .చె.

రాజూరాణీ, రంగులవోణీ
రాణువలెత్తిన రంగులజండా
మంటలు మంటలు, మంటలు మంటలు
జ్వాలాతోరణ కీలాభీలం చె

చీకటి ఖైదులు, చింతలతోపులు
బద్దలుకొట్టే భస్మంచేసే
కష్టంచేసే, నిష్ఠుర జీవులు
బ్రతికేకోసం, పరవలి పరవలి ...చె,

దేశందేశం, భారతదేశం,
భారతదేశం, వీరావేశం,
బాలకుమారుల, క్రోధావేశం
రెచ్చినకోపం, చిచ్చరపిడుగూ .. చె

[illegible]


1. విద్యార్థుల జీతాలపెంపకంద్వారా వసూలయిన హెచ్చుమొత్తాలు ఉపాధ్యాయుల కనీస కోర్కెలను అంగీకరించుటకు అవసరమైన మొత్తంలో నూటికి 10 రూపాయలకు మించి రావు, మిగతా డబ్బువిషయం ?

2. విద్యార్థుల జీతాల పెంపకంతో ఉపాధ్యాయుల జీతాలుపెంచినా ఆచరణలో ఉపాధ్యాయులపైగూడ యీభారం పడుతుంది. ప్రతి ఉపాధ్యాయుని బాల, బాలికలు తమ తండ్రులనుండి తీసుకొనివెళ్ళి చెల్లించే అదనపు ముడుపులుమాత్రం తండ్రి తన జీతం పెంపకంక్రింద భావించి యింటికి తెచ్చుకొనగల్గుతాడు. ఇది ఆచరణలో జీతం పెంపుదల కాగలదా ? ఈ పద్ధతిద్వారా అనేకమంది ఉపాధ్యాయులు తమ పిల్లలజీతాల పెంపుదల వలన హెచ్చుమొత్తాన్ని స్కూలుకు చెల్లించి అంతకుతక్కువ జీతంలో పెంపుదల పొందుతారు

ప్రభుత్వం ఉపాధ్యాయుల జీతాలు పెంపకమునకు విద్యార్థుల జీతాలు పెంచాలనే నినాదం వెనుకనున్న నిజాయితీని పైవిషయాలు బట్టబయలు జేస్తాయి పైపెచ్చు మన సెకండరీ, విశ్వవిద్యాలయ విద్యకు విద్యార్థుల నుండి నూటికి 30 నుండి 60 వరకు అయిన ఖర్చులో వసూలుచేయుట జరుగుతుంది జీతాలు అదనంగా పెంచుట అన్న వేలకొలది విద్యార్థులను విద్యాలయాలనుండి బయటకు నెట్టుటే విద్యావ్యాప్తికి కంకణం కట్టుకొన్న ఉపాధ్యాయులు యీ ప్రభుత్వ ప్రతిపాదనల నెట్లు బలపర్చగలరు ?

ఉపాధ్యాయులు - విద్యార్థుల కర్తవ్యం

విద్యార్థులు ఉపాధ్యాలకోర్కెలను బలపర్చుతారు, అందుకు ఉపాధ్యాయులకు అండగా నిలబడి పోరాడుతారు. ఇదేసమయంలో నేటి స్కూలు జీతముల పెంపుదల విషయాన్ని విద్యార్థులు ఎదిరించుతారు. ఉన్న జీతాలు తగ్గించమని బీదవిద్యార్థులు సెకండరీ విద్యను అభ్యసించుటకు సావకాశముల నేర్పరచమని కోరుతారు ఉపాధ్యాయుల కోర్కెలను అంగీకరించుటకు నేటి బడ్జెటులో నూటికి 10 నుండి 25-30 పాళ్ళవరకు విద్యకు ఖర్చు పెట్టమని ఆదాయాభివృద్ధికి తగిన ప్లానులు తయారుజేయమని కోరుతారు ఉపాధ్యాయ సోదరులుగూడ తమ కోర్కెలను విద్యార్థుల సాయంతో సాధించుటకు విద్యార్థుల జీతాల పెంపుదలను వ్యతిరేకించుతారని — తద్వారా విద్యార్థి, ఉపాధ్యాయ ఐక్యతను నిర్మించుతారని ఆశించుతాం



మత్తుమందు అవసరం లేకుండా ఆపరేషన్

అమెరికన్ డాక్టర్లు కనిపెట్టిన రెఫ్రిజరేషన్ పద్ధతి

— 'రావు'

మామూలుగా శస్త్రచికిత్స (ఆపరేషన్) చేయవలసి వచ్చినప్పుడు రోగికి బాధ లేకుండా చేయడానికి డాక్టర్లు మత్తుమందులు ఇస్తూ ఉంటారు. ఈ మత్తుమందులవల్ల ఆపరేషన్ చేసినప్పుడు బాధలేక పోయినా, ఆ తరువాత రోగికి తలతిప్పు, వాంతులు మొదలైన అవస్థలు వుంటాయి, అంతేకాదు బలహీనమైన గుండెకాయగలవారి కీమత్తుమందులు ప్రాణాపాయం కూడా కలిగించవచ్చు. అందుచేత ఇటువంటి చిక్కులు లేకుండా ఆపరేషన్లలో మత్తుమందులు వాడనవసరం లేని పద్ధతిని అమెరికన్ డాక్టర్లు కనిపెట్టారు ఇప్పుడీపద్ధతి అమెరికాలో చాల ఆసుపత్రులలో అవలంబించబడుతోంది కూడా. ముఖ్యంగా ప్రమాదాలవల్ల కాళ్ళు, చేతులు విరిగిపోయినప్పుడు లేదా వాటిని తొలగించవలసి వచ్చినప్పుడు, ఏ మాత్రం బాధలేకుండా చేయడానికి ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతోంది. ఈ చికిత్సను రెఫ్రిజరేషన్ ఎనెస్తీసియా అంటారు.

ఈ రెఫ్రిజరేషన్ ఎనెస్తీసియా అనే పెద్ద పేరును చూచి మనం ఏమిటో అనుకోనక్కర్లేదు మంచుగడ్డముక్కను కాసేపు చేతిలో పట్టుకుని వుంటే ఏమవుతుందో మనకి తెలుసు అరిచేయి, వేళ్ళు మొద్దుబారిపోతాయి మనస్వాధీనంలో వుండవు అప్పుడు ఆ ముంజేతిమీదగాని, వేళ్ళమీదగాని దెబ్బ తగిలినా, ముల్లుగుచ్చినా మనకేమీ నొప్పి వుండదు

అలాగే బాగా దెబ్బలు తగిలినప్పుడు చిన్న చిన్న కత్తినాట్లు తగిలినప్పుడు వెంటనే చల్లని తడిగుడ్డ చుట్టడం, మంచుగడ్డ పెట్టడం కూడా మనం చేస్తూవుంటాం దీనిమూలంగా బాధ తగ్గడం, తెగిన గాయంనుండి రక్తస్రావం ఆగిపోవడం జరుగుతాయి ఈ మంచుగడ్డ సూత్రాన్నే అమెరికన్ డాక్టర్లు ఆపరేషన్లలో అవలంబిస్తున్నారు గత పదేళ్ళనుంచీ వారు దీనిమీద పరిశోధనలు చేస్తూవచ్చారు మామూలు మంచుగడ్డల నుపయోగించడం కొంచెం అవస్థతో కూడుకొన్న పని అంతేకాదు. ఎక్కువగాపెడితే రోగి టెంపరేచరు బాగా తగ్గిపోయే ప్రమాదంకూడా వుంది అందుచేత ఆధునిక పరికరమైన రెఫ్రిజరేటరులను వారు ఉపయోగిస్తున్నారు.

ఈ రెఫ్రిజరేషన్ చికిత్స ఏమిటి ? ఎలా చేస్తారు ? దానివల్ల లాభాలు ఏమిటోచూద్దాం. ఈ సందర్భంలో హెచ్. ఇ మాక్ అనే డాక్టరు అనుభవం మనకి చాలావరకు దీనిని గురించి తెలుపుతుంది ఒక రోగికి రెండు కాళ్ళూ సగానికి తెగగొట్టవలసి వచ్చిందట. మత్తుమందు ఇవ్వకుండా రోగి మామూలుగా తెలివిగావుండగానే ఈ కొత్తపద్ధతిలో డాక్టరు మాక్ ఆ పని చేసివేశాడు. రోగికి చీమకుట్టినంత బాధకూడా కలుగకుండానే ఆపరేషన్ జరిగిపోయింది

డా. మాక్ చేసినపని ఇది; తెగగొట్టవలసిన కాళ్ళకు రెఫ్రిజరేటర్ సాధనంతో కొంతసేపు మంచుకట్టు (పాకింగ్) కట్టివుంచాడు రోగికాళ్ళు మొద్దుబారిపోయాయి. అలా మొద్దుబారిన కాళ్ళను ఎక్కడికి తెగగొట్టాలో అక్కడికి తెగగొట్టివేశాడు.

ఈ రెఫ్రిజరేషన్ చికిత్సవల్ల ఇంకోమంచి ప్రయోజనంకూడా వుందని డాక్టర్లు అనుభవంలో తెలుసుకున్నారు. దీనివల్ల రక్తం గడ్డకట్టుతుంది అందుచేత ఆపరేన్ ఎంత ఆలస్యమైనా రోగికి రక్తం ఎక్కువగా కారిపోవడం అనే ప్రమాదం లేకుండా పోతుంది. లేకుంటే ఇప్పుడు మామూలుగా జరిగే ఆపరేషన్లలో ఎక్కువ రక్తం కారినట్లయితే రోగి చనిపోకుండా వుండడానికి ఆపరేషన్ అనంతరం రోగికి శరీరంలోకి ఇతరుల రక్తాన్ని ఎక్కించవలసివస్తోంది ఈ రెఫ్రిజరేషన్ పద్ధతివల్ల ఆ అవస్థలేకుండా పోతుంది


రెండోది ఆపరేషన్ అయిపోయిన తరువాతకూడా రోగికి బాధలేకుండా చేయవచ్చు ఈ రెఫ్రిజరేషన్ కట్టునే ఆపరేషన్ అయిన తరువాతకూడా కట్టితే బాధ యేమీవుండదు ఈ కట్టు కొద్దిరోజులు వుంచినా రోగి ఆరోగ్యానికేమీ భంగంకలగదు.

మూడో ప్రయోజనం ఈ విధంగా రోగికి బాధలేకుండా చేయడంవల్ల, అలసిపోవడం, అవస్థపడడం వుండవు అంటే రోగి నరాలు శ్రమపడి అలసిపోవు దీని ఫలితంగా గాయం త్వరగా మానడానికి కూడా ఎంతో ఉపకరిస్తుంది

చికాగో పట్టణంలో ఒక డాక్టరు ఈపద్ధతితో 50 పెద్ద శస్త్ర చికిత్సలు చేశాడు అన్నీ విజయవంతంగానే జరిగాయి, ఆపరేషన్ గాయాలుకూడా అద్భుతంగా నయమయ్యాయి

ప్రముఖ అమెరికన్ వైద్యులైన డా క్రాస్మన్, ఎలెన్ల అభిప్రాయంలో ఈ సూత్రం మెడికల్ సైన్సులో గొప్పవిజయం. ముఖ్యంగా కాళ్ళు, చేతులపై చేసే ఆపరేషనకి ఈ పద్ధతి ఎంతోబాగా ఉపయోగపడుతుంది.

అగ్ని ప్రమాదాలవల్ల శరీరం కాలినవారికి కూడా బాధలేకుండాచేయడానికి ఈరెఫ్రిజరేషన్ పద్ధతిని ఎంతవరకుపయోగించవచ్చుననే విషయంలోకూడా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇందులోకూడా విజయం పొందితే, ఒక్క శస్త్రచికిత్సలలాంటి ఆసుపత్రి వైద్యాలలోనే కాకుండా చాలమంది ప్రాణాలు కాపాడడానికి ప్రథమ చికిత్స(ఫస్టుఎయిడ్)లో మహోత్కృష్టమైన విజయం సాధించామని చెప్పుకోవచ్చు.



గాజుల్లంక

'రావు'

ఇవ్వలేదు! ఇవ్వలేదు!!—మా
అవ్వవియ్యమ్మను, అర్ధరాత్రి
కావాలని కాల్చిచంపి, నీచులు
శవాన్నయినా చూచుటకివ్వలేదు!
లేదులేదక్కడ మానవహృదయం
కాదుకాదది నరజన్మం

2, చల్లని మాతల్లికడుపు
బయొనెట్‌తో చిల్లుపొడిచి
కార్చారొక కడివెడురక్తం
చేశారొక చెరగనిమచ్చను భూదేవికి
లేదులేదక్కడ వెనరూన్యాయం
కాదుకాదది నరునకునైజం

3. రుధిరంచూచిన రైతుబిడ్డలే
రౌద్రంతో లేస్తారని,—కోస్తారని
పేరుకున్న మాయమ రక్తం
పారలతో తవ్వారట! తవ్వారట!!
లేదులేదక్కడ నిలిచేధైర్యం
కాదుకాదది పౌరుషలక్ష్యం,

4. మాపేదల ప్రాణాల్ బలిగొనగోరే
మేపాడట చల్లపల్లి - ఒక
నరరూప రాక్షసమూకను
కురిశాడట కనకపువర్షం లంచం
లేదులేదక్కడ పాపంపుణ్యం
కాదుకాదది పాలించేజన్మం

5 నలువురి అసువుల నిలువునతీసిన
రక్తపిపాసపు రక్కసులారా!
తీరిందా మీదాహం?
తీరదు, తీరే దాహంకాదది
లేదులేదు దానికిఅంతం
కాదుకాదు మీదో మానుషరూపం.

6 కృష్ణానది వేసిన లంకల్లో
కష్టించి తరతరాలుగ పండించే
పాలికుల భూమిహక్కు లప
హరింప, జాచారా కబంధహస్తం?
లేదులేదిక మాలోఅజ్ఞానం
కాదుకాదిది బానిసయుగం

7. మీ ఎత్తులు, మీకత్తులు, మీ
తుపాకులూ ఇక తుత్తునియలు
మృతిచెందిన మావీరులరక్తం
ప్రతిఅణువూ లేస్తోందొక పర్వతమై!
లేదులేదిక దానికిచలనం!!
కాదుకాదు మాది ఓడే సమరం!!!

చిత్రం :
(గాజుల్లంక రైతు స్త్రీలు)

నవయుగ
విరాళాల పట్టిక

లోగడ ప్రకటించిన మొత్తం రు	1530-8-9
ఉరవకొండ విద్యార్థి సంఘం	10-0-0
శ్రీ పూర్ణచంద్రరావు, ప్రసూనాంబ గార్ల వివాహసందర్భమున	10-0-0
శ్రీ విశ్వనాథం సీతామహ లక్ష్మమ్మగార్లు	10-0-0
నందిగామ విద్యార్థి సంఘం	7-4-0
మధుసూదనరావుగారిద్వారా (బందరు)	7-0-0
పెనమలూరు యువజన సంఘం	5-0-0
,, విద్యార్థినులు	1-0-0
బాపట్ల విద్యార్థి సంఘం	5-0-0
మారెళ్ళ నరసింహారావుగారిద్వారా	2-4-0
సామల సీతారామయ్యగారి కుమార్తె పెండ్లి సందర్భమున	10-6-0
వి. సత్యనారాయణప్రసాద్ పెండ్లి సందర్భమున వరుడు	20-0-0
వధువు	15-0-0
	1633-0-9

★

జండా బహూకరణ

అన్ని తాలూకాసంఘాలు తమతమ ఉద్యమ ప్రాబల్యాన్ననుసరించి నవయుగ చందాలు చేర్పించుటకు అమ్మకమును వృద్ధిచేయుటకు పోటీతో కృషిచేయవలెననియు, యీపోటీలో గెలుపొందిన తాలూకాకు జండా బహూకరించ బడుననియు కృష్ణాజిల్లా యువజనసంఘ కార్యదర్శి శ్రీ కృష్ణారావుగారు తెలియచేస్తున్నారు.

★

గమనిక

ఆర్టుపేపరు దొరకని కారణమున యీ సంచిక టైటిలు గ్లేజుపేపరుపై వేస్తున్నాం. వచ్చేసంచిక ఆర్టుపేపరుతోనే తీసికొని రాబడును.

మేనేజరు

నవయుగ చందావివరాలు

సంవత్సర చందా	3—0—0
అర్ధసంవత్సర చందా	1—8—0
మూడు మాసాలకు	0—12—0
విడిపత్రిక	0—4—0



విటమినులు

డాక్టరు
యం. సి. హెచ్. రామలింగేశ్వరరావు
యం. బి. బి. యస్.

విటమినులనుగూర్చి నేడు ప్రతివారూ వినియే యుంటారు. 200 సం. ల సామ్రాజ్యవాద పరిపాలనా ఫలితంగా ఏర్పడిన దారిద్ర్యంతో మన ప్రజలకు సరియైన తిండిలేదు. అందుచే అనేక వ్యాధులు వ్యాపించుతున్నాయి. విటమినులు శరీరంలో లోపించితే యేయే వ్యాధులు ప్రబలేదీ యిందులో వివరించబడింది.

డాక్టరు రామలింగేశ్వరరావుగారు "ఆహారము" (Food) అని ఒక చిన్న గ్రంథం రాశారు. ఈభాగాన్ని అందులోనుండి ప్రకటిస్తున్నాం. ఇతర విటమినులనుగూర్చిన వివరాలు తర్వాత సంచికలో ప్రచురిస్తాం. ఇంకా ప్రచురణజరగని తమ పుస్తకంలోని యీ భాగమును ముద్రణకు అడుగగనే యిచ్చిన శ్రీ రామలింగేశ్వరరావుగారికి మా అభివందనలు.

— సంపాదకుడు.

మన ఆహారవస్తువులలో ముఖ్యమైన పదార్థములు పిండిపదార్థములు, మాంసకృత్తులు, క్రొవ్వుపదార్థములు, ఇవే శరీరమునకు కావలసిన కేలరీల శక్తినియివ్వగలవు. ఇవేగాకుండా నీరు, లవణపదార్థములు (ఉప్పు, కాల్షియం, భాస్వరము, ఇనుము యిత్యాదులు) మొదలగునవి గూడశరీరమునకు అత్యవసరము. ఇవి కేలరీలను (శక్తిని) యిచ్చుటకు పనికిరావు. అయితే పైనచెప్పిన ముఖ్యపదార్థములను (Proximate principles), లవణపదార్థములను మాత్రమే తింటూయున్నచో, కేలరీల కొరతయేమీలేకపోయినను, ఆరోగ్యంక్రమేణా క్షీణిస్తుంది. ఈపదార్థములను అత్యల్పముగనే ఆహారముతో చేర్చినయెడల తిరిగి యథాపూర్వం ఆరోగ్యముచేకూరుతుంది. ఈ విషయాన్ని జంతువులపై ప్రయోగాలవల్ల సర్ యఫ్. జి, హాప్కిన్సు అనునాతడు 1912 లో కనిపెట్టాడు. వీటికొరతలచే బహువిధములైన వ్యాధులు కలుగుతాయి. మరబియ్యం తినుటచే బెరిబెరి (నంజు, కాళ్ళుచేతులుతిమ్మెరలు మొదలగునవి) అను వ్యాధికలుగుతుంది. బియ్యం ఎక్కువగా దంపటంచేతనూ, లేకపాలిషువచ్చేటట్లు మరబట్టించుటచేతనూ తవుడులోని ఒక విధమైన విశిష్టపదార్థం పోతుంది. దానిలోపంవల్ల బెరిబెరి కలుగుతోంది. ఇట్టి ముఖ్యములైన సూక్ష్మపదార్థములకు విటమినులని పేరుపెట్టారు ఇట్లాంటివి షుమారు 10 వరకు శాస్త్రజ్ఞులు తెలుసుకొన్నారు. వీటికిఅక్షరాలతో ఎ, బి, సి, డి, ఇ, అని నామకరణం చేస్తున్నారు. వీటిలో రెండుముఖ్యరకములున్నాయి. కొన్నినీటిలో కరిగేవి. అందుచే యివి చెమ్మగల (కాయగూరలు, ఆకుకూరలు, పండ్లుమొదలగు) పదార్థములలో మిశ్రితమై ఉంటాయి. వీటిలో ముఖ్యముగా చెప్పతగినవి విటమినులు బి, సిలు. మరికొన్ని నీటిలోకరుగక నూనెపదార్థములలో కరుగుతాయి. అందుచేయివి వెన్న, నేయి, కాడ్లివరాయిలు మొదలగు జిడ్డుపదార్థములతో కలసిఉంటాయి. వీటిలో విటమినులు ఎ, డి, ఇ లు ముఖ్యము. ఈవిషయ పరిచయం తర్వాత ప్రతిఒక్క విటమినునుగురించీ కొంచెము విస్తరముగా తెలుసికొందాము.

విటమిను 'ఎ'

ఇది క్రొవ్వుపదార్థములలో కరుగుతుంది' అందుచే ఇది ఆహారపదార్థములలోని క్రొవ్వుభాగములతో చేరియుంటుంది. ముఖ్యముగా కాడ్లివరాయిలు, షార్కు లివరుఆయిలు, మిగతా కొన్ని చేపల లివరు నూనెలు, కోడి గ్రుడ్డులోని పసుపు, చేపలు, మీగడ, పెరుగు, వెన్న నేయి, మొదలగు జంతుసంబంధమైన పదార్థములలో దొరుకుతుంది. శాక సంబంధమైన వానిలో యిది అంతగా దొరకదు, కాని వీటిలోనుండు కెరటిన్ (carotene) అనురంగుపదార్థం శరీరములో విటమిను'ఎ' పనినిచేయును. ఏమంటే యీ కెరటిన్ శరీరములో తేలికగా విటమిను "ఎ"గా మార్చబడుతుంది. అందుచే ఈకెరటిన్ విటమిను "ఏ" కు ముందరి పదార్థము (Provitamin A) అని కూడ చెప్పబడుతూంది. ఈరూపేణా, క్యాబేజీ మొదలయిన ఆకు కూరలలోను, కొత్తిమేర మొదలగు ఆకులు, బాగా పండిన మామిడి, బొప్పాయి, నారింజ, టొమాటో పండ్లయందును యీవిటమిను యుంటుంది. ఈకెరటిన్ నారింజవర్ణం గలది. కేరట్సులో యిది చాలా ఉన్నది.

ఈపదార్థము రోజుకు 3000 యూనిట్లకు తక్కువగాకుండా యుండుట ఆరోగ్యమునకు చాలమంచిది. ఇది పాశ్చాత్య దేశములలో జంతుసంబంధమైన మాంసాది ఆహార పదార్థములను విరివిగా తినుటచే తేలికగా లభ్యమౌతుంది. కాని మనకు ఆకు కూరలేముఖ్యాధారము. పైగా నేతిలోను, ఆవు పాలలోను ఆవునకిచ్చే మేతపై నాధారపడి విటమిను "ఎ" ఎక్కువ తక్కువగా వుంటుంది. నేతిని మూతలేకుండా చాలసేపుకాచినచో అందులోని "ఎ" చాలభాగము తగ్గిపోవును. ఆవునేతిలో గ్రాము 1కి 1000 నుండి 2500 యూనిట్లవరకు "ఎ" ఉండును, డాల్డా వనస్పతిలో విటమిను "ఎ" లేదు. అందుచే ముఖ్యముగా శాకాహారులమగు మన దేశస్థులలో విటమిను "ఎ" కొరత సామాన్యము. దీనికి తగుశ్రద్ధ తీసుకొనవలసి యుంటుంది. కాడ్లివరాయిలు (లేక షార్కు, లేక హాలిబట్ లివర్ నూనెలు) దినము యిచ్చుటయే తేలిక పద్ధతి. పిల్లలకు ఇది మంచిపుష్టికరము. అట్లే నిలకడైన ఆరోగ్యములేని పెద్దలకును విటమిను "ఎ" ముఖ్యము.

దీనికొరతచే ఏర్పడు వ్యాధులేమిటంటే, వయసునకు సరిపోయిన ఎదుగుటలేకపోవుట (పెరుగుటకు ముఖ్యమైన విటమిను), కళ్ళమీది తెల్లనిపొర (Conjunction) గరగరలాడుచు తెల్లనిపొడి మచ్చలుకలిగియుండుట, రేచీకటి, సులభముగా అంటువ్యాధులచే బాధపడుట మొదలైనవి. కంటిలోపలి నరములతో కూడిన పొర (Retina) లోని "విజువల్ పర్పుల్"లో విటమిను "ఎ" ఉంటుంది. ఇది మనము ఏదైన చూచునప్పుడు విడగొట్టబడును. దృష్టిదారుఢ్యమునకు యిది ముఖ్యావసరము. ఇది కొరతయైనపుడు సంధ్యవేళలందు కొద్ది వెలుతురులోను చూపు స్పష్టముగానుండదు. దీనినే రేచీకటి యందురు. దీని కొరత బాగాఎక్కువయినచో చంటిపిల్లలకు కంటిమీద నల్లనిపొర వడలి, పుండుపడి, పూడిపోవును. అందుచే గ్రుడ్డితనమేర్పడవచ్చును. ఇట్టి తీవ్రలోపములను తీర్చుటకు ఆహార పదార్థములకంటె "ఎడాక్సలిను" (Adaxolin) ఎడామిను (Adamin), కాడ్లివరు ఆయిలు, హాలిబట్ లివర్ఆయిల్ పట్టుదలతో కొన్నినెలలు తీసికొనుటమంచిది.